

RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 2 సంచిక : 276 | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | గురువారం 2 జనవరి 2025 | వెల : 4/-

## కార్పొరేషన్ రద్దు దిశగా

# అడుగులు



- 5 కార్పొరేషన్లు... 95 వేల కోట్లు
- కానీ తాహతుకు మించి చేసే అప్పులు పెను నష్టాన్ని కలిగిస్తాయి.
- అప్పుల కోసమే కార్పొరేషన్లు సృష్టించి ఎడా పెడా బాకీలు తెచ్చింది గత కేసీఆర్ సర్కార్
- ప్రభుత్వ ఖజానాను ఫుట్ బాల్ మాదిరి ఆడుకోవడం కరెక్ట్ కాదు
- రాష్ట్రంలో చాలా కార్పొరేషన్ల పరిస్థితి దినదినగండం నూరేళ్ల ఆయుష్షు అన్నట్లుగా తయారైంది
- సో వాటికి చెక్ పెట్టేలా లిస్ట్ రెడీ చేసింది ప్రభుత్వం

### అప్పుల కోసం.. కార్పొరేషన్లు...

**హైదరాబాద్**

అప్పు చేయడం తప్పు కాదు.. అవసరం ఉన్నప్పుడు చేయాల్సిందే. అవసరాలు తీర్చుకోవాల్సిందే. అంతే బాధ్యతగా తిరిగి చెల్లించాల్సిందే. ఇదే చాణక్యనీతి చెబుతున్న మాట. కానీ తాహతుకు మించి చేసే అప్పులు పెను నష్టాన్ని కలిగిస్తాయి. గత కేసీఆర్ ప్రభుత్వం ఇదే చేసింది. దొరికిన చోటల్లా అప్పులు చేసింది. అభివృద్ధి చేయడానికే అప్పులు చేశామన్న మాట ఆనాడు వినిపించారు. కానీ మార్కెట్లో ఉన్న వడ్డీల కంటే అధిక వడ్డీలకు అప్పులు తీసుకురావడం ఒక తప్పు. అప్పుల కోసమే కార్పొరేషన్లు సృష్టించి ఎడా పెడా బాకీలు తెచ్చింది గత కేసీఆర్ సర్కార్. ఇప్పుడు అవి గుదిబండగా మారాయి. అప్పుల కుప్పగా అయ్యాయి. అందుకే వాటిలో ఏవి ఉండాలో ఏవి ఊడాలో డిసైడ్ చేస్తోంది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అదే చేస్తోంది. అప్పుల కుప్పగా మారిన కార్పొరేషన్ల లిస్టు రెడీ చేసింది. ఏవి సొంతంగా రెవెన్యూ జెనరేట్ చేసుకుని లాభాల్లో ఉన్నాయి.. ఏవి నిండా మునిగాయో లిస్టు రెడీ చేసింది. - మిగతా3లో



## రైతుల సంక్షేమం కోసమే..

- రైతులకు గుడ్ న్యూస్ చెప్పిన కేంద్రం
- ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకాన్ని పొడిగించాలని కేబినెట్ తీర్మానం
- దేశవ్యాప్తంగా నాలుగు కోట్ల మంది రైతులు లబ్ది పొందుతున్నారు
- ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రూ. 69,515 కోట్లకు పెంపు

## పెట్టుబడులు

# తెచ్చేందుకు

- ఆస్ట్రేలియాకు సీఎం రేవంత్‌రెడ్డి.
- పెట్టుబడులకు తెచ్చేందుకు తీవ్ర ప్రయత్నాలు
- జనవరి 14న నుంచి సీఎం రేవంత్ రెడ్డి ఫారెన్ టూర్‌కి
- తెలంగాణ నుంచి ఆటగాళ్లు ఒలింపిక్స్‌కు వెళ్లేలా ఇప్పటి నుంచే ప్రణాళికలు
- ఆస్ట్రేలియాలో తొలుత క్వీన్‌లాండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీని సందర్శించనుంది సీఎం టీమ్.



**హైదరాబాద్**

తెలంగాణకు పెట్టుబడులకు తెచ్చేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు సీఎం రేవంత్‌రెడ్డి. ఇందులో భాగంగా విదేశీ పర్యటనకు శ్రీకారం చుట్టారు. జనవరి 14న నుంచి సీఎం రేవంత్ రెడ్డి ఫారెన్ టూర్‌కి బయలు దేరనున్నారు.జనవరి 15న ఆస్ట్రేలియాలో పర్యటించనున్నారు. క్వీన్స్‌లాండ్ క్రీడా విశ్వవిద్యాలయాన్ని పరిశీలించనున్నారు. అక్కడ 3-4 రోజుల పాటు పర్యటించనుంది. అక్కడి రేవంత్ బృందం జనవరి 19న సింగపూర్‌కు వెళ్లనుంది. - మిగతా3లో



## ప్రతి విద్యార్థిపై శ్రద్ధ తీసుకోవాలి

- మీ అందరి వాడిని అలసత్వం వహిస్తే సహించేది లేదు
- తరచుగా గురుకుల పాఠశాలల హాస్టల్లు తనిఖీలు చేయాలి
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి విద్యార్థికి అడ్మిషన్‌తో పాటే యూనిఫామ్, మెటీరియల్ పంపిణీ
- ఆర్థికాభివృద్ధి కోసం ఫెడరేషన్లు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి
- విశ్వకర్మ పథకం లబ్దిదారులను గుర్తించాలి.
- బీసీ సంక్షేమ శాఖ రివ్యూ మీటింగ్‌లో మంత్రి పొన్నం



వర్కాల అర్థిక్

భవిష్యత్తులో మీరు ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని మనసారా కోరుకుంటూ...

జన్మదిన శుభాకాంక్షలు

# తెలంగాణ ఎటుపోతోంది..?



- పెరిగిన క్రైమ్‌రేట్‌పై హరీశ్ ఆందోళన
- ఏ ప్రభుత్వమైనా రాష్ట్ర భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తుంది
- శాంతి భద్రతలు ఎలా ఉన్నాయని చూసి పెట్టుబడులు పెడుతారు
- క్రైమ్‌రేట్‌లో తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు ఎల్లో జోన్లకు వెళ్లింది

**హైదరాబాద్**

దేశంలో అయినా అంతర్గత భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఉంటుందని.. ఏ ప్రభుత్వమైనా రాష్ట్ర భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇస్తుందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఒక రాష్ట్రం, జిల్లాలో పెట్టుబడి పెట్టాలంటే నేషనల్ క్రైమ్ బ్యూరోలో క్రైమ్‌రేట్ ఎంతుంది? క్రైమ్ జరిగితే ఎంత మందిని పట్టుకుంటున్నారు..? రాష్ట్రంలో ఎన్ని రేప్ కేసులు జరుగుతున్నాయి ? శాంతి భద్రతలు ఎలా ఉన్నాయని చూసి పెట్టుబడులు పెడుతారన్నారు. క్రైమ్‌రేట్‌లో తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు ఎల్లో జోన్లకు వెళ్లిందని.. ఇది ఎంతో బాధాకరమైన విషయమన్నారు. కేసీఆర్ అధికారంలో ఉన్న పదిహేనేళ్లలో తెలంగాణ ఎప్పుడు ఎల్లో జోన్‌లోకి వెళ్లలేదని.. దక్షిణాదిలో ఎల్లో జోన్‌లో ఉన్న ఒకే ఒక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. రాష్ట్రంలో క్రైమ్‌రేట్ 23శాతం పెరిగిందని.. రేప్ కేసులు 29శాతం పెరిగాయన్నారు. దళితులు, గిరిజనులపై రేప్ కేసులు 12శాతం పెరిగాయని.. రాష్ట్రం ఎటు పోతోందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర పోలీసులు బెస్ట్ పోలీసులని.. ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణకు వచ్చి క్రైమ్ కంట్రోల్ ఎలా చేయాలని - మిగతా3లో

# భద్రత బలగాలకు తప్పిన ముప్పు

ఛత్తీస్‌గఢ్, జనవరి 01: ఛత్తీస్‌గఢ్‌లో భద్రత బలగాలకు తృటిలో ప్రమాదం తప్పింది. భద్రత బలగాలే లక్ష్యంగా ఐ.ఈ.డీ బాంబులను మావోయిస్టులు అమర్చారు. రహదారిపై తనిఖీల్లో భాగంగా వాటిని భద్రతా బలగాలు గుర్తించాయి. ఆ వెంటనే భద్రత బలగాలు రంగంలోకి దిగాయి. ఆయా బాంబులను నిర్వీర్యం చేశాయి. బీజాపూర్ జిల్లాలోని బాసగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఐ.ఈ.డీ బాంబులు.. మూడు కేజీలు బరువు ఉన్నాయని పోలీస్ ఉన్నతాధికారులు వివరించారు. మరోవైపు దేశంలో మావోయిస్టుల నిర్మూలనే లక్ష్యంగా కేంద్రం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. అందులోభాగంగా ఛత్తీస్‌గఢ్‌లో పోలీసులు, భద్రతా దళాలు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఆ క్రమంలో పలు ఎన్‌కౌంటర్లు చోటు చేసుకున్నాయి. ఆయా వివరాలను పోలీస్ ఉన్నతాధికారులు బుధవారం రాయ్‌పూర్‌లో వివరించారు. ఈ ఒక్క ఏడాది.. 2024లో బస్తర్ ప్రాంతంలో మావోయిస్టులు, భద్రతా దళాల మధ్య 121 ఎన్‌కౌంటర్లు



చోటు చేసుకున్నాయి. వాటిలో 217 మంది తీవ్రవాదులు మరణించారు.

ఇక గత ఐదు సంవత్సరాల్లో హతమైన మావోయిస్టుల్లో 57 మంది అగ్రనేతలు ఉన్నారన్నారు. దశాబ్దాల చరిత్ర ఉన్న వామపక్ష తీవ్రవాద చరిత్రలో ఈ ఏడాది బస్తర్‌లో అత్యధికంగా సీనియర్ మావోయిస్టులు మృతి చెందారని తెలిపారు. ఇక మరణించిన మావోయిస్టు అగ్రనేతల్లో.. ఆరుగురు ప్రత్యేక జోనల్ కమిటీ (ఎస్‌జెడ్‌సి) సభ్యులు, నక్సల్స్‌కు సంబంధించిన వివిధ రాష్ట్ర కమిటీల సభ్యులు, 16 మంది డివిజనల్ కమిటీ (డివిసి) సభ్యులు, 32 మంది ఏరియా కమిటీ సభ్యులు, ఒక కంపెనీ డిప్యూటీ కమాండర్, ఇద్దరు ప్లాటూన్ కమాండర్లు ఉన్నారన్నారు.

ఈ ఏడాది 925 మంది మావోయిస్టులను అరెస్టు చేయగా... ఒక్క బస్తర్‌లోనే 792 మంది తీవ్రవాదులు లొంగిపోయారన్నారు. అలాగే ఈ ప్రాంతంలో 284 ఆయుధాలతోపాటు 311 ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్‌లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. సమగ్రమైన వ్యూహా రచనతో 2024లో బస్తర్‌లో అత్యధికంగా.. 57 మంది మావోయిస్టు అగ్రనేతలను నిర్వీర్యం చేశాయని పోలీస్ ఉన్నతాధికారి సోదాహరణా వివరించారు. ఇక హతమైన మావోయిస్టు అగ్రనేతల తలలపై రూ. 4.62 కోట్ల రివార్డు ఉందని గుర్తు చేశారు.

# ఎయిడ్స్‌కు టీకా...

**లండన్ :** ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న ఎయిడ్స్ వ్యాధికి టీకా వచ్చేసింది. ఈ టీకా కోసం ప్రపంచం కొన్ని సంవత్సరాలుగా కళ్లు కాయలు కాచే విధంగా ఎదురుచూస్తోంది. 2000 నుంచి 2008 వరకు ప్రపంచం మొత్తం ఎయిడ్స్ అంటే భయపడిపోయింది. ఐక్యరాజ్య సమితి ప్రపంచ వ్యాప్తంగా ఎయిడ్స్ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. ఆసియా, ఆఫ్రికా అని తేడా లేకుండా ప్రపంచ వ్యాప్తంగా ఐక్యరాజ్యసమితి ఎయిడ్స్ నివారణ పై.. ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం చేసింది. బహిరంగ ప్రదేశాలలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసింది. నాడు పులిరాజాకు ఎయిడ్స్ వస్తుందా అనే యాడ్ విస్తృతంగా ప్రచారం, ప్రసారం కావడానికి ప్రధాన కారణం కూడా అదే. అయితే ఎయిడ్స్ వల్ల నాటి రోజుల్లో లక్షలాది మంది చనిపోయారు. ముఖ్యంగా ఆఫ్రికా దేశాలలో చాలామంది కన్నుమూశారు. ఎయిడ్స్ వచ్చిన వారిని సామాజికంగా బహిష్కరించడంతో నరకం చూశారు. అందువల్లే ఎయిడ్స్ పై ప్రపంచ దేశాలు యుద్ధం ప్రకటించాయి. నివారణకు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాయి. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో అయితే సెలబ్రిటీలు తమ బాధ్యతగా ఎయిడ్స్ నివారణ పై ప్రచారం నిర్వహించారు. ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తమవంతుగా వివరించే ప్రయత్నం చేశారు. 2009 తర్వాత జరిగిన పరిశోధనల అనంతరం ఎయిడ్స్ నివారణకు మందులు అందుబాటులోకి వచ్చాయి. దీనివల్ల ఎయిడ్స్ తగ్గకపోయినప్పటికీ.. రోగి జీవిత కాలాన్ని పెంపొందించే అవకాశం దక్కింది. పరిశోధనలు నిత్యం జరగడం వల్ల కొత్త కొత్త మందులు అందుబాటులోకి




వచ్చాయి. అయితే ఎన్ని మందులు అందుబాటులోకి వచ్చినా ఎయిడ్స్ నివారణ మాత్రమే సాధ్యమైంది. రోగి జీవితకాలం పెంపొందించడం మాత్రమే సాధ్యపడింది. కానీ ఎయిడ్స్ నిర్మూలన అనేది వీలు కాలేదు. అయితే ఇప్పుడు ప్రపంచానికి శుభవార్త చెప్పే విధంగా ఎయిడ్స్ శాశ్వత నిర్మూలనకు వ్యాక్సిన్ వచ్చింది. గిలీడ్ సైన్సెస్ అనే సంస్థ ఒవనిజీఞజీజూజూజీలతితీ అనే టీకాకు జూ ఈఆం ఆమోదం తెలిపింది.. వచ్చే మూడు సంవత్సరాలలో ఈ టీకా 20 లక్షల మంది దాకా చేరుతుంది. దక్షిణాఫ్రికా, టాంజానియా ప్రాంతాలలో ఈ వ్యాక్సిన్ కు సంబంధించి ట్రయల్ నిర్వహించారు. దీనివల్ల మెరుగైన ఫలితాలు వచ్చాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దక్షిణాఫ్రికా, టాంజానియా లో ఎయిడ్స్ కేసులు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ మరణాలు కూడా అదే సంఖ్యలో చోటు చేసుకుంటున్నాయి. అందువల్లే ఇక్కడ ట్రయల్స్ నిర్వహించారు. అవి విజయవంతం కావడంతో ఎయిడ్స్ టీకాకు జూ ఈఆం ఆమోదం తెలిపింది.. ప్రతి ఏడాది రెండుసార్లు ఈ టీకా తీసుకోవాల్సి ఉంటుంది. అయితే దీని ధర ఎంత అనేది బయటికి చెప్పలేదు. వ్యాక్సిన్ బయటికి రావడంతో.. మరో మూడు నెలల్లో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో.. రకరకాల అపహాలు చెలరేగుతున్నాయి. వ్యాక్సిన్ ధర పేదలకు అందుబాటులో ఉండదని.. కేవలం శ్రీమంతులకు మాత్రమే దీనిని కొనుగోలు చేసే అవకాశం ఉంటుందని.. ఐక్యరాజ్యసమితి అనుబంధ ఆరోగ్య విభాగం వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఈ వ్యాక్సిన్ ను పేద దేశాలకు ఉచితంగా అందించాలనే డిమాండ్లు మొదలయ్యాయి. అయితే ఈ వ్యాక్సిన్ ను కేవలం గిలీడ్ సైన్సెస్ మాత్రమే అభివృద్ధి చేసిన నేపథ్యంలో.. దానికి మాత్రమే పేటెంట్ రైట్స్ ఉంటాయని తెలుస్తోంది. ఈ వ్యాక్సిన్ తయారీకి ఆ కంపెనీ భారీగా నగదు ఖర్చు చేసినట్టు తెలుస్తోంది.ఎయిడ్స్ 1983లో వెలుగులోకి వచ్చింది. దీనిని మొట్టమొదటిసారిగా అమెరికాలో గుర్తించారు. ఆ తర్వాత ఈ వ్యాధి అన్ని దేశాలకు విస్తరించింది. ఎయిడ్స్ అనేది ప్రపంచ దేశాలకు పెను ముప్పుగా మారింది. దీంతో ఎయిడ్స్ కు మందు లేదు.. నివారణ మాత్రమే సాధ్యం అనే నినాదం అప్పట్లో పుట్టుకొచ్చింది. ఎయిడ్స్ వల్ల ఇప్పటివరకు ప్రపంచ వ్యాప్తంగా 4.2 కోట్ల మంది చనిపోయారు. మొత్తంగా 8.8 కోట్ల మందికి ఈ వ్యాధి సోకింది. గత ఏడాది చివరి నాటికి నాలుగు కోట్ల మంది ఎయిడ్స్ తోనే బతికీడుస్తున్నారు.. వారు మందులు వాడుతూ తమ జీవిత కాలాన్ని పెంచుకుంటున్నారు.

# మహిళా ఓటర్లే కీలకం

**న్యూఢిల్లీ :** ఎన్నికలు వచ్చాయంటే సామాజిక, ప్రాంతీయ సమీకరణాలు ముందుకొస్తాయి. ఏ వర్గానికి చెందిన ఓటర్లు ఎక్కువ సంఖ్యలో ఉంటే వారిని ఆకట్టుకోవడం కోసం ఏం చేయాలా అని అన్ని



పార్టీలూ ఆలోచిస్తుంటాయి. త్వరలో దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇప్పుడు ఇలాంటి సమీకరణాలతో ప్రధాన రాజకీయ పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు తేదీలు సమీపిస్తున్న వేళ ఈ పట్టణ రాష్ట్రంలో వర్గాలు, ప్రాంతాలవారిగా ఓటర్లను విభజించి ఆకట్టుకునే ప్రయత్నాలు సైతం ఊపందుకున్నాయి. ఇందులో అందరి దృష్టిని ఆకట్టుకుంటున్నవారు ఢిల్లీలో నివసిస్తున్న పూర్వాంచల్ వాసులు. నగర జనాభాలో 40 లక్షల మంది.. అంటే 24 శాతం ఈ ప్రాంతానికి చెందినవారేనని గణాంకాలు చెబుతు న్నాయి. ఇంత పెద్ద సంఖ్యలో నివసించే సమూహం ఎటు మొగ్గుచూపితే అటు అధికారం కైవసమవుతుందని రాజకీయ పండితులు అభిప్రాయపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో అసలు పూర్వాంచల్ అంటే ఏంటి.. ఆ ప్రాంతం నుంచి ఇంత పెద్ద సంఖ్యలో ఢిల్లీలో ఎందుకు నివాసం ఉంటున్నారు.. గత ఎన్నికల్లో వారంతా ఏ పార్టీ వైపు మొగ్గుచూపారు.. వంటి అనేక సందేహాలు తలెత్తుతున్నాయి.హిందీలో 'పూర్వ్' అంటే తూర్పు అని అర్థం. పశ్చిమాన రాజస్థాన్, హర్యానా నుంచి తూర్పున బిహార్, జార్ఖండ్ వరకు హిందీ మాట్లాడే ప్రజలున్న భారతదేశంలో తూర్పు ప్రాంతాన్ని పూర్వాంచల్ అంటారు. ఇది ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పు ప్రాంతాలు (గోరఖ్‌పూర్, వారణాసి)తో పాటు బిహార్, జార్ఖండ్ రాష్ట్రాల వరకు విస్తరించి ఉంది. ఇక్కడి ప్రజలు హిందీలో ఓ ప్రత్యేక యాస (భోజ్‌పురి) మాట్లాడతారు. భాష మాత్రమే కాదు, ఆహార, సంస్కృతుల్లోనూ మిగతా ప్రాంతాలతో పోల్చితే భిన్నత్వం కనిపిస్తుంది. రాజస్థాన్, యూపీ, మధ్యప్రదేశ్ అంతటా గోధుమ ప్రధాన ఆహారం కాగా, పూర్వాంచల్ వాసులు మాత్రం వరి అన్నాన్నే ఎక్కువగా ఇష్టపడతారు. మిగతా ప్రాంతాలతో సంబంధంలేని ప్రత్యేక పర్వదినాలు ఈ ప్రాంతంలో కనిపిస్తాయి.సామాజిక, ఆర్థిక స్థితిగతుల ప్రకారం చూస్తే మిగతా దేశం కంటే ఈ ప్రాంతవాసుల్లో ఎక్కువ మంది దారిద్ర్యరేఖకు దిగువన కనిపిస్తారు. అందుకే దేశవ్యాప్తంగా పట్టణీకరణ వేగంగా జరుగుతున్న ప్రాంతాలకు వలసపోతూ ఉపాధి వెతుక్కుంటూ ఉంటారు. భవన నిర్మాణ కార్మికుల నుంచి డ్రైవర్లు, స్వీపర్లు, సెక్యూరిటీ గార్డులు వంటి కింది స్థాయి ఉద్యోగాల్లో వీరు ఎక్కువగా కనిపిస్తారు. దేశ రాజధాని ఢిల్లీలో కూడా ఇలా ఉపాధి కోసం వచ్చి నివసిస్తున్న పూర్వాం చల్ వాసులు నగర జనాభాలో 4వ వంతు ఆక్రమించారు. అంటే ప్రతి నలుగురిలో ఒకరు ఈ ప్రాంతానికి చెందినవారని అర్థం. పూర్తిగా పట్టణ రాష్ట్రమైన ఢిల్లీలో మొత్తం 70 అసెంబ్లీ స్థానాలుండగా, వాటిలో 17 నుంచి 20 అసెంబ్లీ స్థానాల్లో పూర్వాంచల్ ఓటర్ల ప్రభావం ఎక్కువగా ఉంది. మరికొన్ని నియోజకవర్గాల్లో గణనీయంగా ఉంది.ఢిల్లీలో వరుసగా రెండు పర్యాయాలు ఆమ్ ఆద్మీ పార్టీ విజయం సాధించడం వెనుక పూర్వాంచల్ ఓటర్ల పాత్రే కీలకమని గ్రహించిన భారతీయ జనతా పార్టీ (ఃఏఖ).. వారిని ఆకట్టుకోవడం కోసం వ్యూహాలు రచిస్తోంది. పేద, దిగువ మధ్యతరగతి జనాభా ఎక్కువగా ఉన్న పూర్వాంచల్ ఓటర్లు.. కేజ్రీవాల్ ప్రకటించే ఉచిత విద్యుత్తు, మెరుగైన ప్రభుత్వ పాఠశాలలు, మహల్లా క్లినిక్‌ల ద్వారా గల్లీల్లో లభించే వైద్యం వంటి కార్యక్రమాల పట్ల ఆకర్షితులై ఆ పార్టీకి కొమ్ముకాస్తూ వచ్చారు. తమకు బలమైన ఓటుబ్యాంకుగా మారిన పూర్వాంచల్ ఓటర్లను జాబితా నుంచి తొలగించేలా బీజేపీ కుట్ర చేస్తోందంటూ ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణలను కొట్టిపారేస్తున్న కమలనా థులు.. పూర్వాంచల్ ఓటర్లను ఆకట్టుకోవడం కోసం ఆ ప్రాంతానికి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలను ప్రచారపర్వంలో రంగంలోకి దించుతున్నారుఈ క్రమంలో భోజ్‌పురి గాయ కుడు, బీజేపీ ఎంపీ మనోజ్ తివారీతో పాటు బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరిని ఎన్నికల ప్రచారపర్వంలో ముందు వరుసలో నిలబెట్టింది. బిజెపి తన ఎన్‌డిఎ మిత్రపక్షాలు జెడియు మరియు ఎల్‌జెపికి కొన్ని సీట్లు ఇవ్వాలని కూడా ప్లాన్ చేసింది, తద్వారా బిహార్‌తో సంబంధం ఉన్న ఈ మిత్రపక్షాల కారణంగా పూర్వాంచలి ఓటర్లు బిజెపిలో చేరారు. బిజెపి ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో బీహార్ ఉప ముఖ్యమంత్రులను మాత్రమే కాకుండా, అరవింద్ కేజ్రీవాల్‌ను ఎదుర్కోవడానికి బీహార్ మరియు తూర్పు యుపి నుండి చాలా మంది సీనియర్ ఎంపీలు మరియు నాయకులను కూడా రంగంలోకి దింపుతోంది.ఇదొక్కటే కాదు, బీజేపీ తమ పూర్వాంచల్ మోర్చాతో సహా అన్ని మోర్చాలకు పూర్వాంచల్ సంస్కృతిని ప్రతిబింబించేలా ప్రచార కార్యక్రమాలను అప్పగించింది. గతంలో నిర్వహించిన "చాయ్ పే చర్చ" (టీ తాగుతూ చర్చించడం) మాదిరిగా "లిట్టీ–చోఖా పే చర్చ" జరుపాలని సూచించింది. లిట్టి–చోఖా పూర్వాంచల్ ప్రాంతంలో పేరెన్నికగల వంటకం. హైదరాబాద్ బిర్యానీ, ఆగ్రా పేటా, దక్షిణదిన ఇడ్లీ తరహాలో లిట్టి చోఖా పూర్వాంచల్ ప్రాంతంలో ఎక్కడ చూసినా కనిపిస్తుంది. ఇది ఎక్కడైనా కనిపించింది అంటే అక్కడ పూర్వాంచల్ వాసులు ఉన్నారని అర్థం. లిట్టీ–చోఖా మీద చర్చించడం ద్వారా ఆ ప్రాంత ఓటర్లను ఆకట్టుకోవచ్చన్నది కమలనాథుల వ్యూహంగా కనిపిస్తోంది. దీంతో పాటు ఇదే మాదిరిగా ఓ డజను పథకాలను బీజేపీ అమలు చేయబోతోంది. ఈ కార్యక్రమాల్లో బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన జాతీయ, ప్రాంతీయ స్థాయి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.విజయానికి దారితీసే ఏ చిన్న అవకాశాన్ని కూడా వదులుకోకూడదన్నది బీజేపీ విధానం. అందులో భాగంగా పూర్వాంచల్ ఓటర్లకు దగ్గరయ్యేందుకు "పూర్వాంచల్ స్వాభిమాన్ సమ్మేళనం", పూర్వాంచల్ సాంస్కృతిక కమిటీ సంప్రదింపు ప్రచారం, "పూర్వాంచల్ సమాజ్ సంవాదం" వంటి కార్యక్రమాలలో 150 మందికి పైగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు మరియు 25,000 మందికి పైగా బీజేపీ కార్యకర్తలు పాల్గొననున్నారు. అయితే ఈ కార్యక్రమాల కంటే ఈ సమాజానికి రాజకీయ భాగస్వామ్యం ఇవ్వడం ద్వారా మాత్రమే బీజేపీ లాభపడుతుందని రాజకీయ నిపుణులు భావిస్తున్నారు. అందుకే ఒక్కో బూత్‌లో కనీసం ఐదుగురు పూర్వాంచలి బీజేపీ నేతలు, కార్యకరతలను పార్టీ సిద్ధం చేస్తుంది.అలాగే 1,200 సభలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. పూర్వాంచల్ ప్రాంతంలో పట్టున్న మిత్రపక్ష రాజకీయ పార్టీలు జనతాదళ్ (యునైటెడ్), లోక్‌జన్‌శక్తి పార్టీ (రాంవిలాస్ పాశ్వాన్) వంటి పార్టీలకు ఢిల్లీ అసెంబ్లీలో సీట్లు కేటాయించి పోటీ చేయించే ఆలోచనలో కూడా కమలనాథులు ఉన్నట్టు సమాచారం. ఇలా బహుముఖ వ్యూహంతో పూర్వాంచల్ ఓటర్లను ఆకట్టుకుని ఈ సారి ఎలాగైనా సరే ఢిల్లీ గద్దెపై కమలం జెండా ఎగరేయాలన్న కృతనిశ్చయంతో కాషాయ పార్టీ ఉంది.

## రైతుల సంక్షేమం కోసమే..




**న్యూఢిల్లీ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ బుధవారం న్యూఢిల్లీలో సమావేశమైంది. ఈ భేటీలో కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆవన్నీ రైతుల సంక్షేమం కోసమే కేంద్ర కేబినెట్ ఈ నిర్ణయాలు తీసుకుంది. అందుకు సంబంధించిన వివరాలను న్యూఢిల్లీలో విలేకర్ల సమావేశంలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వివరించారు. దేశవ్యాప్తంగా రైతుల కోసం చేపట్టిన.. ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకాన్ని పొడిగించాలని కేబినెట్ తీర్మానం చేసిందని తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రూ. 69,515 కోట్లకు పెంచినట్లు వివరించారు. అలాగే ఫండ్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీకి రూ. 800 కోట్ల కేటాయించినట్లు పేర్కొన్నారు. సాంకేతికతను ఉపయోగించి త్వరితగతిన రైతుల పంటలకు పంట బీమా చెల్లింపు విధానానికి ఫండ్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ తోడ్పడనుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ సోదాహరణగా వివరించారు. కొత్త సంవత్సరం ప్రారంభమైన తొలి రోజు భేటీ అయిన.. ఈ తొలి కేబినెట్‌ను రైతులకు అంకితం ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించిందని చెప్పారు. ఇక ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద దేశవ్యాప్తంగా నాలుగు కోట్ల మంది రైతులు లబ్ధి పొందుతున్నారని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాగే 50 కిలోల బస్తా డీఏపీ.. రూ.1,350కి రైతులకు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ డీఏపీ ఎరువులపై అదనపు భారాన్ని భరించాలని కేంద్రం నిర్ణయించిందని సోదాహరణగా ఆయన వివరించారు.

డీఏపీ ఎరువుల సబ్సీడీకి అదనంగా రూ.3,850 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. 2014లో ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టారు. నాటి నుంచి గతేడాది వరకు.. అంటే 2024 చివరి వరకు.. ఎరువుల సబ్సీడీ కింద రూ. 11.9 లక్షల కోట్లను కేంద్రం ఖర్చు చేసింది. అదే విధంగా 2024లో ముచ్చటగా మూడోసారి కేంద్రంలో మోదీ ప్రభుత్వం కొలువు తీరింది. ఆ క్రమంలో రైతుల కోసం రూ. 6 లక్షల కోట్ల విలువైన 23 కీలక నిర్ణయాలను కేంద్రం తీసుకుంది.

## 124 ఏళ్లలో అత్యంత వేడి సంవత్సరంగా 2024..!

ప్రపంచవ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు ముగిశాయి. అన్ని దేశాల ప్రజలు 2024కు గుడ్‌బై చెప్పి 2025లో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా వాతావరణ కేంద్రం 2024 సంవత్సరానికి సంబంధించి ఓ కీలక విషయం చెప్పింది. 1901 నుంచి గడిచిన 124 ఏళ్లలో



2024 అత్యంత వేడి సంవత్సరంగా నిలిచిందని వెల్లడించింది. 2024లో నేలపై కనిష్ఠ ఉష్ణోగ్రతల సగటు సాధారణ సగటు కంటే 0.65 డిగ్రీ సెల్సియస్ ఎక్కువగా ఉందని పేర్కొంది. 1901 నుంచి 2020 వరకు నమోదైన దీర్ఘకాలిక సగటు కంటే ఇది చాలా ఎక్కువని భారత వాతావరణ కేంద్రం డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మొహపాత్ర తెలిపారు. అందుకే 2024 ఏడాది గత 124 ఏళ్లలో అత్యంత వేడి సంవత్సరంగా నిలిచిందని అన్నారు. దాంతో ఇప్పటివరకు అత్యంత వేడి సంవత్సరంగా నమోదై ఉన్న 2016 రెండో స్థానానికి వెళ్లిపోయిందని చెప్పారు. 2016లో నేలపై సాధారణ కనిష్ఠ సగటు ఉష్ణోగ్రత కంటే 0.54 సెల్సియస్ ఎక్కువగా నమోదైందని అన్నారు. వరల్డ్ వెదర్ అట్రిబ్యూషన్, క్లైమేట్ సెంట్రల్ అనే రెండు వాతావరణ శాస్త్రవేత్తల బృందాలు ప్రతి ఏడాది ఉష్ణోగ్రత రిపోర్టులు అందిస్తాయి. 2024లో మొత్తం 41 కిపైగా రోజులు ప్రమాదకరమైన వేడి కలిగిన రోజులుగా రికార్డయ్యాయని వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు.

## మన్మోహన్ స్మారకం కోసం రెండు స్థలాలను ప్రతిపాదించిన కేంద్రం

**న్యూఢిల్లీ:** మాజీ ప్రధాని దివంగత మన్మోహన్ సింగ్ స్మారక చిహ్నం నిర్మించే ప్రక్రియను కేంద్రం ప్రారంభించింది. రాజ్‌ఘాట్, రాష్ట్రీయ స్మృతి స్థల్‌తో పాటు కిసాన్ ఘాట్ సమీపంలో 1 నుంచి 1.5 ఎకరాల స్థలంలో స్మారక చిహ్నం కోసం



ప్రతిపాదించినట్టు సమాచారం. పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అధికారులు ఈ ప్రాంతాలను ఇప్పటికే పరిశీలించారు. ఈ రెండు స్థలాల్లో ఒక స్థలాన్ని ఎంచుకోవాలని మన్మోహన్ సింగ్ కుటుంబ సభ్యులకు అధికారులు సూచించినట్టు తెలుస్తోంది. కొత్త విధానం ప్రకారం, మెమోరియల్ కోసం స్థలాన్ని ట్రస్టుకు మాత్రమే కేటాయించాల్సి ఉంటుంది. ఆ కారణంగా ప్రాజెక్టు ప్రారంభించడానికి ముందు ట్రస్టు ఏర్పాటు కావాలి. ట్రస్టు ఏర్పాటయిన వెంటనే భూమి కేటాయింపు కోసం దరఖాస్తు చేసుకోవాలి. నిర్మాణం కోసం సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌తో ఎంఓయూపై సంతకం చేయాలి. కాగా, మన్మోహన్ సింగ్ స్మారక చిహ్నం జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, సంజయ్ గాంధీ స్మారకాలు ఉన్న రాజ్‌ఘాట్‌కి సమీపంలో ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. మన్మోహన్ సింగ్ మరణానంతరం స్మారక చిహ్నం నిర్మాణంపై కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం కూడా నడిచింది. స్మారక చిహ్నం కేటాయించే చోటులోనే అంత్యక్రియలు జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేయగా, ఆ పార్టీ దిగజారుడు రాజకీయాలు చేస్తోందని బీజేపీ తిప్పికొట్టింది.

## ఎలన్ మాస్క్ తన పేరు మార్చుకున్నారా

**న్యూయార్క్ :** అమెరికన్ బిలియనీర్, ఎక్స్ యజమాని ఎలోన్ మస్క్ ప్లాట్‌ఫారమ్‌పై తన పేరును మార్చుకున్నారు. ఆయన ఎక్స్ లో తన పేరును కెకియస్ మాక్సిమస్‌గా మార్చుకున్నాడు. అతను తన ప్రొఫైల్ పిక్చర్ నుండి తన ఫోటోను తీసివేసి, దాని స్థానంలో 'పెప్ ది ఫ్రాగ్' మీమ్ ఫోటోను అప్ లోడ్ చేశాడు. ఇందులో పెప్ యోధుడిలా దుస్తులు ధరించి, చేతిలో గేమ్ జాయ్‌స్టిక్ పట్టుకుని ఉన్నారు. ఇంతకుముందు మస్క్ ట్విట్టర్ పేరును ఎక్స్ గా మార్చారు. మస్క్ తన సోషల్ మీడియా పోస్ట్‌ల కారణంగా తరచూ వార్తల ముఖ్యాంశాల్లో నిలిచారు. కెకియస్ మాక్సిమస్ ఒక మెమెకోయిన్, క్రిప్టోకరెన్సీ మార్కెట్‌లో పెద్ద పేరు. గత కొద్ది రోజులుగా దీనికి సంబంధించిన కార్యకలాపాలు పెరిగి ఇన్వెస్టర్లను ఆకర్షిస్తోంది. దీని 24–గంటల ట్రేడింగ్ వాల్యూమ్ 2,734,948డాలర్లకి పెరిగింది. పెట్టుబడిదారులు దానిపై ఆసక్తి చూపుతున్నారు. డిసెంబర్ 27న గరిష్ట స్థాయికి చేరుకుంది. కెకియస్ మాక్సిమస్ లో తాజాగా భారీ జంప్ కనిపిస్తోంది. అయితే, ఫ్లాట్ ఫారమ్ పై తన పేరును ఎందుకు మార్చుకున్నాడో మస్క్ ఇంకా వివరించలేదు.మీమ్ కాయిన్స్ అనేది ఇంటర్నెట్‌లో జరుగుతున్న ట్రెండ్‌లు లేదా మీమ్‌ల ద్వారా ప్రేరణ పొందిన క్రిప్టోకరెన్సీ. కొన్ని సంవత్సరాల క్రితం కూడా మస్క్ షిబా ఇను ప్రేరేపిత డాడ్జ్‌కాయిన్ గురించి నిరంతరం ట్వీట్ చేయడం ద్వారా చాలా ప్రజాదరణ పొందేలా చేశారు.

# కార్పొరేషన్ రద్దు దిశగా అడుగులు

-మొదటిపేజీ తరువాయి

ఆ ప్రకారంగా వాటిని మూసేసేందుకు సిద్ధమవుతోంది. నిజానికి ప్రభుత్వ ఖజానాను ఫుట్ బాల్ మాదిరి ఆడుకోవడం కరెక్ట్ కాదు.రాష్ట్రంలో చాలా కార్పొరేషన్ల పరిస్థితి దినదినగండం నూరేళ్ల ఆయుష్షు అన్నట్లుగా తయారైంది. సో వాటికి చెక్ పెట్టేలా లిస్ట్ రెడీ చేసింది ప్రభుత్వం. ప్రభుత్వ నిధులు వృధా అవుతూ ఎలాంటి ఉపయోగం లేని వాటికి గుడ్ బై చెప్పబోతోంది. అందులోని ఉద్యోగులను ఇతర సంస్థల్లో విలీనం చేయాలన్న ఆలోచన చేస్తున్నారు. అటు ఎస్సీఎస్టీబీసీ కార్పొరేషన్లను మరింత బలోపేతం చేయడం, రెవెన్యూ ఎక్కువ జెనరేట్ చేస్తున్న వాటికి మరింతగా బూస్టప్ ఇచ్చేలా రేవంత్ ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతోంది.తెలంగాణలో ప్రస్తుతం 90కి పైగా కార్పొరేషన్లు ఉన్నాయి. ఇందులో ఐదారు తప్ప మిగతా కార్పొరేషన్లకు ఎలాంటి ఇన్ కమ్ లేదు. కేవలం నామ్ కే వాస్తేగా నడుస్తున్నాయి. ఇందులోనూ ఎక్కువ కార్పొరేషన్లు రాజకీయ నిరుద్యోగుల పదవుల భర్తీ కోసం, ప్రభుత్వానికి అప్పులు తెచ్చి పెట్టేందుకు మాత్రమే ఉపయోగపడ్డాయి. సో ఓవరాల్ గా చూస్తే కార్పొరేషన్ల ద్వారా గత కేసీఆర్ ప్రభుత్వం తీసుకున్న మొత్తం అప్పులు 2 లక్షల 82వేల 84 కోట్లుగా ఉంది. ఇది మొత్తం తెలంగాణ రాష్ట్ర అప్పులో 42 శాతంగా ఉందంటే ఏ స్థాయి కుప్ప జమైందో అర్థం చేసుకోవచ్చు.ఇందులో ప్రభుత్వం హామీ ఇచ్చి, తీర్చాల్సిన అప్పులు ఒక లక్షా 27 వేల 208 కోట్లుగా ఉంది. అలాగే గత ప్రభుత్వ షూరిటీలతో అప్పులు తీసుకుని, వాటిని తీర్చే బాధ్యత కార్పొరేషన్ల మీద ఉన్నవి 95 వేల 462 కోట్ల రూపాయలు. అంతే కాదు ఇవన్నీ చాలవన్నట్లుగా కార్పొరేషన్లు సొంతంగా బాకీలు చేసి, తామే తీర్చే అప్పులు 59వేల 414 కోట్లుగా ఉంది. అయితే ఈ కార్పొరేషన్లకు ఇన్ కమ్ లేక వీటి అప్పులను కూడా సర్కారీ ఖజానా నుంచే చెల్లించాల్సిన పరిస్థితి దాపురించింది.ఉన్న కార్పొరేషన్లలో 90 శాతం కార్పొరేషన్లు అప్పుల ఊబిలోనే ఉన్నాయి. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్లుగా అప్పుల విషయంలో గత ప్రభుత్వం వ్యవహరించిన తీరు ప్రస్తుత ప్రభుత్వానికి తలకుమించిన భారంగా మారింది. అందుకే వాటిని సెట్ రైట్ చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన కార్యాచరణ రెడీ చేస్తోంది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. ఇది ప్రజల భారాన్ని తగ్గించడం కోసమే. ప్రజల సంక్షేమం బాగుండాలంటే ముందుకు అధిక మిత్తీలకు తెచ్చిన అప్పుల్ని క్లియర్ చేసేయాల్సిన పరిస్థితి ఉంది.ప్రజా ధనాన్ని పకడ్బందీగా వాడాలి. ఎక్కడా రూపాయి వేస్ట్ కావొద్దన్నదే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. వాటిని ప్రజా సంక్షేమం కోసం ఉపయోగించాలన్న కాన్సెప్ట్ తో రేవంత్ ప్రభుత్వం పనిచేస్తోంది. అందులో భాగంగానే ఇప్పటికే గుదిబండగా ఉన్న లోన్ల రీస్ట్రక్చరింగ్ పై నజర్ పెట్టింది. అధిక వడ్డీలకు తెచ్చిన లోన్లపై టాప్ అప్ ల జోలికి వెళ్లడం లేదు. ఇంటి కోసం హోమ్ లోన్ తీసుకునే వారిలో కొందరు టైమ్ కంటే ముందుగానే తమ చేతికి డబ్బు అందినప్పుడల్లా ప్రిన్సిపుల్ అమౌంట్ కడుతుంటారు. లోన్ త్వరగా క్లియర్ చేసుకునే పనిలో ఉంటారు. ఇప్పుడు ప్రభుత్వం కూడా అదే పని చేస్తోంది.తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ, టూరిజం డెవలమెంట్ కార్పొరేషన్, బేవరేజెస్ కార్పొరేషన్, జెన్కో, ట్రాన్స్కో, సివిల్ సప్లయ్స్, ఫారెస్ట్ డెవలప్ మెంట్, మినరల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్లు, సింగరేణి వంటివి తమంతట తాము సెట్ చేసుకునే పరిస్థితిలో ఉన్నాయి. అంటే వాటికి వివిధ మార్గాల ద్వారా వచ్చే నిధులను జీతాలు, నిర్వహణ ఖర్చుల కోసం వాడుకుంటున్నాయి. ప్రభుత్వంపై ఆధారపడే పరిస్థితిలో లేవు.నిరుద్యోగులకు ట్రైనింగ్ ఇచ్చి ఉపాధి చూపాల్సిన సెట్విన్ అనే కార్పొరేషన్ పూర్తిగా ఉనికి కోల్పోయింది. ఫిల్మ్ అండ్ టెలివిజన్, థియేటర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ తో పాటు ట్రాక్టర్లు, హార్వెస్టర్లు కొనుగోలు చేసి రైతులకు అందించే ఆగ్రోస్ వంటివి నిధుల్లేక ఖాళీగా చేతులెత్తేసి రెడీగా ఉన్నాయి. ఆయిల్ ఫెడ్, మార్క్ ఫెడ్, హాకా వంటి సంస్థలకు ప్రభుత్వమే నిధులు సమకూరుస్తోంది. వీటితో పాటే స్టేట్ హ్యాండి క్రాఫ్ట్స్ డెవలప్ మెంట్ కార్పొరేషన్, స్టేట్ బ్యాక్ వర్డ్ క్లాసెస్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్, స్టేట్ మోస్ట్ బ్యాక్వర్డ్ క్లాసెస్ డెవలప్మెంట్ కార్పొరేషన్, విశ్వబ్రాహ్మణ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్, మేదర కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్,ట్యాడీ టాపర్స్ కో-ఆపరేటివ్ కార్పొరేషన్..మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్, వుమెన్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్, వికలాంగుల కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, స్టేట్ యోగాధ్యయన పరిషత్, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్, లెదర్ ఇండస్ట్రీస్ డెవల్పమెంట్ కార్పొరేషన్, ఆగ్రోస్ డెవలప్ మెంట్ కార్పొరేషన్, వేర్హౌసింగ్ కార్పొరేషన్, ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు, టెక్స్టైల్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్, లైవ్స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవల్పమెంట్ కార్పొరేషన్, సెట్విన్, ట్రైకార్, తెలంగాణ ఫుడ్స్ వంటివి ఉన్నాయి. ఇలాంటి సంస్థలపై ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోవాలని అనుకుంటోంది. ఏం చేస్తే ఇవి ఉపయోగపడుతాయి? ఎలా చేయాలన్నది ఫైనల్ కాల్ తీసుకోబోతున్నారుఅసలు ఆదాయమే లేని కార్పొరేషన్లను ఏర్పాటు చేయడమే కాకుండా వాటి నుంచి ఎక్కువ వడ్డీతో అప్పులు తీసుకుంది గత సర్కారు. మొత్తం కార్పొరేషన్ల అప్పులు ఒక ఎత్తు అయితే? ఐదు కార్పొరేషన్లవే ఏకంగా 95 శాతం బాకీలున్నాయి. అందులో నెంబర్ వన్ లాస్ కంపెనీ కాళేశ్వరం కార్పొరేషన్. ఆ తర్వాత డ్రింకింగ్ వాటర్ కార్పొరేషన్, వాటర్ రీసోర్స్ కార్పొరేషన్, హౌసింగ్ కార్పొరేషన్, రోడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్, గొర్రెల కార్పొరేషన్ వంటివి ఉన్నాయి.ఇవే 95 శాతం అప్పులు తెచ్చుకున్నాయి. తెస్తే తెచ్చాయి.. కానీ మార్కెట్ లో ఒక వడ్డీ రేటు ఉంటే అంతకంటే ఎక్కువ పెట్టి తేవడంలో లాజిక్స్ ఏంటన్నది తేల్చే పనిలో ఉన్నారు. మార్కెట్ లో ఇంట్రెస్ట్ రేట్ యావరేజ్ గా 7.63 శాతంగా ఉంది. కానీ ఏకంగా 10.49% వడ్డీతో లోన్లు తెచ్చింది గత సర్కార్. ఇలా ఎవరైనా చేస్తారా? ఇది ఎంత గుదిబండో అర్థం చేసుకోలేకపోయారా? ఓన్లీ అడిగినంత అప్పులు ఇస్తే చాలు అనుకున్నారా?కాళేశ్వరం కార్పొరేషన్ పై 9.69% ఇంట్రెస్ట్ రేటుతో 74 వేల 599 కోట్ల రూపాయలు అప్పు చేశారు. తెలంగాణ డ్రింకింగ్ వాటర్ కార్పొరేషన్ పై 9.48% వడ్డీ రేటుతో 20,200 కోట్లు అప్పులు చేశారు. వాటర్ రీసోర్స్ కార్పొరేషన్ పై అత్యధికంగా 10.49% ఇంట్రెస్ట్ తో 14 వేల 60 కోట్ల రూపాయలు బాకీలు తెచ్చారు. ఇది ప్రభుత్వ ఖజానాపై ఎంతలా భారం మోపుతోందో ప్రస్తుత ప్రభుత్వానికి అర్థమవుతోంది. ఇక హౌసింగ్ కార్పొరేషన్ పై 9 వేల కోట్లు, రోడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ పై 2,951 కోట్ల రుణాలు ఉన్నాయి.గొర్రెల కార్పొరేషన్ కింద గత ప్రభుత్వం గొర్రెల స్కీం కోసం 4 వేల కోట్లు, చేపల కోసం మరో 600 కోట్ల అప్పు చేసింది. ఇక హాస్పిటల్స్ నిర్మాణాల కోసం కూడా 3,535 కోట్లు కార్పొరేషన్ల కిందనే బాకీలు తీసుకుంది. అయితే ఇందులో హౌసింగ్ వంటి వాటికి కచ్చితంగా రుణాలు తీసుకోవాల్సినవే. అయితే ఎక్కువ వడ్డీ రేట్లకు బాకీలు తేవడమే ఇప్పుడు ఖజానాను ఖతం చేస్తోంది. తెలంగాణలో కార్పొరేషన్లు ఎలా అప్పుల ఊబిలో ఉన్నాయో చూశాం కదా. వీటితో రోజులు గడిచేకొద్దీ నష్టాలే తప్ప లాభాలు ఉండవు. అందుకే కార్పొరేషన్లను సెట్ చేయడం, లోన్లను రీస్ట్రక్చర్ చేయడం, సాధ్యమైనంత వరకు అసలు, బాకీలు తీర్చుకుంటూ వెళ్లడమే రేవంత్ సర్కార్ టార్గెట్ గా పెట్టుకుంది. సీఎం రేవంత్ ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ అధిక వడ్డీలకు కేసీఆర్ తెచ్చిన ఈ లోన్ల రీ స్ట్రక్చరింగ్ పై రిక్వెస్టులు చేస్తూ వస్తున్నారు. కొంత వరకు సక్సెస్ అయ్యారు కూడా. ఓవైపు గత ప్రభుత్వం సృష్టించిన అప్పుల విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించే ప్రయత్నాలు చేస్తుంటే విపక్షం మాత్రం ఇప్పటి ప్రభుత్వమే అప్పుల మీద అప్పులు చేస్తోందని విమర్శలు చేయడమే విడ్డూరం.

# ప్రతి విద్యార్థిపై శ్రద్ధ తీసుకోవాలి

**హైదరాబాద్ :** ప్రతి విద్యార్థి అభివృద్ధే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలి పిల్లలు బాగుండాలి అందరూ బాధ్యతాయుతంగా పని చేయాలి అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. విద్యార్థులకు మౌలిక వసతుల్లో, భోజనం విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ, కమిషనర్, ఎంజెపి గురుకుల సొసైటీ కార్యదర్శి, ఆర్ సిఓ, ప్రిన్సిపల్స్, జిల్లా అధికారులతో నిర్వహించిన జూమ్ మీటింగ్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ పలు సూచనలు చేశారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులు గురుకుల లో చేరే నాటికే వారికి ఇవ్వాల్సిన యూనిఫామ్, ట్రంక్ పెట్టె, బెడ్డింగ్ మెటీరియల్ అన్నీ సిద్ధంగా ఉంచాలని ఆయన ఆదేశించారు. ప్రతి విద్యార్థి పై శ్రద్ధ తీసుకోవాలని, చదువులో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు. దశాబ్ద కాలంగా నిర్లక్ష్యానికి గురైన బీసీ సంక్షేమ శాఖ ను ఏడాది కాలంగా చక్కదిద్దే ప్రయత్నాలు చేస్తున్నామని, ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలకు సహకారం అందిస్తున్న అధికారులను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా స్మార్ట్ వర్క్ చేస్తూ బాధ్యతాయుతంగా ఉండాలని, ఏదైనా సమస్య ఉంటే తమ కుటుంబ సభ్యుడిగా భావించి తన దృష్టికి తీసుకురావాలని, తమకు కేటాయించిన పని విషయంలో అలసత్వం వహిస్తే మాత్రం సహించబోనని హెచ్చరించారు.



విద్యార్థుల భవిత బాగుండాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ఉండాలని, ఎన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నా కొన్ని అవాంచనీయ సంఘటనలు జరగడం మనసును కలిచివేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల మౌలిక భోజన సదుపాయాల కల్పనలో రాజీ పడవద్దని, మార్చిన మెనూ ప్రకారం భోజనం తప్పనిసరిగా అందించాలని, ఆర్ సిఓలు, జిల్లా అధికారులు తరచుగా తనిఖీలు చేయాలని ఆయన సూచించారు. గురుకుల, హాస్టల్ విద్యార్థులకు పరీక్ష సమయంలో ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించాలని, మెరుగైన ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయడంతో పాటు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మంత్రి ఉద్ఘాటించారు.

జాతీయ రోడ్డు బద్రత మాసం లో భాగంగా అన్ని గురుకులాల్లో రోడ్డు భద్రత పై అవగాహన కల్పించాలని సూచించారు. కామన్ డైట్ లో భాగంగా మార్చిన కొత్త మెనూ ప్రకారం భోజనం అందించాలని, అందుకు కావల్సిన వంట సామాను, ఆహార పదార్థాలు కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. క్వాలిటీ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, తరచుగా తనిఖీలు చేయాలని ఆయన సూచించారు. ఈ మూడు నెలలు చాలా ముఖ్యమని నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. అద్దెభవనాల్లో ఉన్న విద్యా సంస్థలో చిన్నచిన్న మరమత్తులు ఉంటే చేయించమని భవనాల యజమానులను అడగాలని, ఇటీవలే వారికి అద్దె బకాయిలు సగం వరకు చెల్లించామని మంత్రి గుర్తు చేశారు. ఎవ్వరైనా విద్యార్థులకు కావల్సిన మౌలిక సదుపాయలు కల్పించకపోతే వేరే భవనాలను చూడాలన్నారు. సంక్రాంతి పండుగ లోగా సమస్యలు ఉన్న భవనాలను ఖాళీ చేసి కొత్త భవనంలోకి మార్చాలని ఆయన సూచించారు. అద్దె భవనాల నుంచి సొంత భవనాలు కల్పించడానికి వీలుగా ప్రభుత్వ స్థలాలను పరిశీలించాలన్నారు. గురుకుల విద్యాసంస్థల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, విద్యార్థుల భవితే ప్రభుత్వానికి ముఖ్యమని ఆయన అన్నారు. మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ఉన్నత విద్యాప్రమాణాలు పాటిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. ఆహార పదార్థాల కొనుగోలు, నిల్వ, నాణ్యత, విద్యార్థుల ఆరోగ్యం, చదువు తదితర అంశాలపై ప్రతినెలా నివేదిక ఇవ్వాలన్నారు.

అన్నీ ఫెడరేషన్లు యాక్షన్ ప్లాన్ సిద్దం చేయాలి.. బీసీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందుకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపు జరిగిందన్నారు. బీసీలను ఆర్థికంగా బలోపేతం చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్దం చేయాలని, ఫెడరేషన్స్ ఆధ్వర్యంలో బీసీ వర్గాల అభ్యున్నతికి అవసరమైన ప్రణాళికను సిద్దం చేయాలని మంత్రి సూచించారు. టాడీ టాపర్స్ కోసం రూపొందించిన కాటమయ్య కిట్ ఇప్పటివరకు పదివేల మందికి అందించామని, మరో పదివేల మందికి అందించడానికి సిద్దంగా ఉన్నామని, అవసరమైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన అన్నారు. నాయి బ్రహ్మణ, రజక ఫెడరెషన్ ఆధ్వర్యంలో ఇస్తున్న ఉచిత కరెంటు పథకం యధావిధిగా కొనసాగుతుందని, ఎవ్వరికీ అసౌకర్యం కలుగకుండా విద్యుత్ శాఖకు లేఖ రాయాలని మంత్రి సెక్రటరీ సూచించారు.

విశ్వకర్మ పథకం లబ్ధిదారులను గుర్తించాలి. కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఇ ద్వారా కులవృత్తుల వారికి ఆర్థిక సహాయం అందించే విశ్వకర్మ పథకం గురించి అందరికీ అవగాహన కల్పించాలని, ప్రతి జిల్లా నుంచి 35వేల మంది లబ్ధిదారులను గుర్తించాలని మంత్రి సూచించారు. ఇప్పటి వరకు 33వేల దరఖాస్తులు చేయించిన నల్లగొండ జిల్లా అధికారిని అభినందించారు. మిగతా జిల్లాల అధికారులు త్వరగా లబ్దిదారులను గుర్తించాలి. ఈ పథకంపై అవగాహన కల్పించడంలో వెనుకబడిన వారికి ఒక ఇంక్రిమెంట్ కట్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీధర్, కమిషనర్ బాల మాయాదేవి, మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి బడుగు సైదులు, సంయుక్త కార్యదర్శి తిరుపతి, మద్దిలేటీ, ఇతర ఉన్నతాధికారులు, ఆర్ సిఓలు, ప్రిన్సిపాల్స్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పెట్టుబడులు తెచ్చేందుకు

-మొదటిపేజీ తరువాయి

తెలంగాణ నుంచి ఆటగాళ్లు ఒలింపిక్స్కు వెళ్లేలా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు సీఎం రేవంత్ రెడ్డి. ఆస్ట్రేలియాలో తొలుత క్వీన్లాండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీని సందర్శించనుంది సీఎం టీమ్. ఆ తర్వాత సింగపూర్ వెళ్లి అక్కడి క్రీడా ప్రాంగణాలు పరిశీలించనుంది. ఒలింపిక్స్లో ఆసియా దేశాలకు ఎక్కువగా పతకాలు రావడంతో అటు వైపు దృష్టి పెట్టారు. రీసెంట్గా సౌత్ కొరియా వెళ్లి అక్కడి స్పోర్ట్స్ యూనివర్సిటీని పరిశీలించిన విషయం తెల్సిందే.సింగపూర్ తర్వాత స్విట్జర్లాండ్లోని దావోస్లో జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక 55వ వార్షిక సదస్సుకు హాజరుకానున్నారు ముఖ్యమంత్రి. దావోస్లో 20 నుంచి 24వ తేదీ వరకు అంటే దాదాపు ఐదు రోజులపాటు సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు జనవరి 21 నుంచి హాజరవుతున్నారు. 23 వరకు దావోస్లో పర్యటించనున్నారు.ఈ ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సుకు సీఎం రేవంత్తోపాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్బాబు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ఇతర అధికారులు హాజరవుతున్నారు. గతేడాది దావోస్ పర్యటన సందర్భంగా సుమారు 40 వేల కోట్లకు పైగా పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలను ప్రభుత్వం పలు కంపెనీలతో కుదుర్చుకుంది. అవి కార్యరూపం దాల్చే ప్రక్రియ వేర్వేరు దశల్లో ఉన్నట్లు పరిశ్రమల శాఖ వర్గాలు తెలిపాయి. ప్రస్తుత పర్యటనలో మరిన్ని పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా రేవంత్రెడ్డి టీం ప్రణాళికలను సిద్ధం చేసింది.

## అన్నం పెట్టే రైతులను కాంగ్రెస్ అవమానిస్తోంది.. ధ్వజమెత్తిన హరీశ్‌రావు

అన్నం పెట్టే రైతులను కాంగ్రెస్ అవమానిస్తోందని మాజీ మంత్రి హరీశ్రావు మండిపడ్డారు. సంగారెడ్డిలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీరు సౌకర్యం లేని రైతులే పత్తి సాగు చేస్తారన్నారు. 50 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్న దళిత గిరిజన బీసీ రైతుల నోట్లో మట్టి కొట్టడమేనన్నారు. చెరుకు పసుపు పండ్లతోటకు పెట్టుబడి ఎక్కువని.. అలాంటప్పుడు ఆ రైతులకు ఒకటేసారి రైతు భరోసా ఇస్తానంటే ఎట్లా? అంటూ ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో లక్ష ఎకరాల్లో చెరుకు పంట పండుతుందని.. లక్ష ఎకరాల్లో పసుపు పంట పండుతుందని తెలిపారు. 10 లక్షల ఎకరాల్లో మామిడి తోటలు, ఆయిల్ పామ్ తోటలు, ఇతర పండ్ల తోటలు ఉన్నాయని.. 10లక్షలు ఎకరాల్లో దాదాపు కంది సాగు జరుగుతుందన్నారు. ఇలాంటి రైతులకు ఒకటేసారి రైతు భరోసా ఇస్తానంటే ఎలా? అంటూ నిలదీశారు.

**కొండల్లో.. గుట్టల్లో ఉండేది గిరిజన రైతులే..**

రాళ్లు రప్పలకు రైతు భరోసా ఇవ్వమంటున్నారని.. కొండల్లో, గుట్టల్లో ఉండేది గిరిజన రైతులు మాత్రమేనన్నారు. అంటే గిరిజన రైతులకు రైతు భరోసా ఎగ్గొట్టాలని ప్రభుత్వం చూస్తున్నదా? అని నిలదీశారు. అన్ని ఆలోచించిన కేసీఆర్ రైతుల ఆత్మగౌరవం కాపాడాలని ఉద్దేశంతో అందరికీ రైతుబంధు ఇచ్చి గౌరవించారన్నారు. అందరికీ అన్నం పెట్టే రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం అవమానిస్తుందన్నారు. రైతు గౌరవాన్ని కేసీఆర్ పెంచితే.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అడుక్కునేలా చేస్తుందన్నారు. దరఖాస్తులు పెట్టి పైరవీకారుల చుట్టూ తిరిగేలా చేస్తుందన్నారు. అందరికీ అన్నం పెట్టే రైతులు అడుక్కునే వారిలా మార్చకండి అంటూ హితవు పలికారు. అందరు రైతులకు రైతు భరోసా ఇవ్వాలని సూచించారు. అకాల వర్షాల వల్ల పత్తి రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని.. పత్తి దిగుబడి తగ్గిందన్నారు. వర్షం ఆధారంగా పత్తిని సాగు చేస్తారని.. ఎక్కువ మంది దళిత గిరిజన బీసీ రైతులే ఉంటారన్నారు. వాళ్ల కడుపు కొట్టకండని.. సంవత్సరానికి ఒకేసారి పండిన పంటైనా సరే దానికి పెట్టుబడి ఎక్కువ ఉంటుందన్నారు.

**హార్టికల్చర్ పంటలకు ఖర్చు ఎక్కువే..**

చెరుకు, పత్తి, పసుపు, ఇతర హార్టికల్చర్ పంటలు సంవత్సరానికి ఒకసారి పండినా వాటిక అయ్యే ఖర్చు ఎక్కువగానే ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కోతలు.. తప్ప రైతులకు ఇచ్చిందేమీ లేదన్నారు. రుణమాఫీ సగం మందికే అయ్యిందని.. అన్ని పంటలకు బోనస్ అని చెప్పి.. కేవలం సన్నాలకు మాత్రమే బోనస్ ఇస్తామంటున్నారన్నారు. పంటల బోనస్ విషయంలో పది పంటలకు బోనస్ ఇస్తామని ఒక్క పంటకే బోనస్ అని అందులో సన్న రకాలకే బోనస్ ఇస్తామంటున్నారన్నారు. రైతుబంధు వానకాలం ఎగొట్టారని.. యాసంగి ఎగ్గొట్టే కుట్ర చేస్తున్నారన్నారు. పంటలకు బీమా అసెంబ్లీ స్పీచ్లో చెప్పారని.. వానాకాలంలో అడుగుతే ఏసంగిలో ఇస్తామన్నారన్నారు. యాసంగిలో అడుగుతే మల్ల వచ్చే సంవత్సరం చూస్తామని అంటున్నారన్నారు. రైతులకు వ్యవసాయ పనిముట్లు ఇస్తామని ఇవ్వలేదని.. పాడి రైతులకు ప్రోత్సాహమని చెప్పి.. అదీ ఇవ్వలేదన్నారు. 24 గంటల కరెంటు అన్నారని.. 16 గంటలకు నుంచి కరెంటు ఇవ్వడం లేదన్నారు.

**ఇంకా రుణమాఫీ కాలే..**

కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన ఒక్క హామీ అయినా నిలబెట్టుకున్నారా? అంటూ ప్రశ్నించారు. 2 లక్షల పైనున్న రుణాన్ని అప్పులు తెచ్చి మరి కడితే ఇప్పటి వరకు రుణమాఫీ కాలేదని తెలిపారు. సీఎం మాట నమ్మి 2 లక్షల పైనున్న రుణాలను అప్పు తెచ్చి కట్టిన రైతులకు ఇంకా రుణమాఫీ కాలేదన్నారు. ఆ రైతుల పైన మిత్తి భారం పడుతుందని.. వారికి ఏం సమాధానం చెబుతారన్నారు. వ్యవసాయ కూలీలకు 28వ తారీఖు నాడే రూ.12వేలు ఇస్తామని చెప్పి మాట తప్పారన్నారు. వ్యవసాయ కూలీలకు కోత పెట్టేందుకు వారి సంఖ్యను తగ్గించేందుకు కుట్ర జరుగుతున్నదన్నారు. రాష్ట్రం లో 54 లక్షల ఉపాధి హామీ కార్డులు ఉన్నాయని.. ఒక కోటి నాలుగు లక్షల మంది కూలీలు ఉన్నారన్నారు. ఉపాధి హామీలో పనికి వెళ్లే వారందరూ బతుకుతెరువు కోసం వెళ్లే వారేనని.. అందులో ఏరివేత ఎందుకు? అంటూ ప్రశ్నించారు. ఉపాధి హామీ పనికి వెళ్లే వారికి భూమి ఎంత ఉందో చూసి కొలిచి, వారికి ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పొద్దున 6 గంటలకు లేచి మట్టి పనికి వెళ్లే కూలీలకు పరీక్షలా?
అంటూ ప్రశ్నించారు.

**కూలీలకు కూడా రూ.12వేలు ఇవ్వాల్సిందే..**

ఎలాంటి షరతులు లేకుండా ఉపాధి హామీ కార్డు ద్వారా పనిలోకి పోతున్న కోటి నాలుగు లక్షల మందికి సంవత్సరానికి రూ.12వేలు ఇవ్వాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తుందన్నారు. ఎకరంలోపు ఉన్న వారందరినీ వ్యవసాయ కూలీలుగా పరిగణించాలన్నారు. ఉపాధి హామీ కోసం మే నెలలో రూ.857 కోట్ల కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి వస్తే ఇప్పటివరకు రాష్ట్రంలో పనిచేసిన కూలీలకు అందించలేదన్నారు. ఆ డబ్బులను బడా కాంట్రాక్టర్లకు పర్సంటేజ్ తీసుకొని బిల్లులు చెల్లిస్తున్నారన్నారని.. ఉపాధి హామీ కూలీలకు మాత్రం డబ్బులు ఇవ్వడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం డబ్బులు ఇచ్చిన మూడు నెలల్లో ఉపాధి హామీ కూలీలకు చెల్లించకపోతే మూడు నెలల తరువాత వడ్డీతో సహా చెల్లించాలని చట్టాలు చెబుతున్నాయన్నారు. ఏడు నెలలు గడిచినా.. ఇంకా ఉపాధి హామీ కూలీలకు డబ్బులు ఇవ్వలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలో డబ్బులు వేస్తే మళ్లిస్తున్నారన్నారు. ఇప్పటి నుంచి రైతులకే నేరుగా ఉపాధి హామీ డబ్బులు వేయాలని కేంద్రం నిర్ణయించిందని వివరించారు.

# తెలంగాణ ఎటుపోతోంది?

-మొదటిపేజీ తరువాయి

నేర్చుకునేవారన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్ రాష్ట్ర పోలీసులు తెలంగాణ పోలీసుల వద్ద ట్రైనింగ్ తీసుకునేవారన్నారు. ఇప్పుడు ఉన్నది కూడా అదే పోలీసులేనని.. దేశానికే ట్రైనింగ్ ఇచ్చిన పోలీసులను ఈ రోజు రేవంత్ రెడ్డి రాజకీయ కక్ష సాధింపు కోసం వాడుకుంటున్నాడని మండిపడ్డారు. తెలంగాణ పోలీసుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నాడు రేవంత్ రెడ్డి అని.. హాక్ ఐ లాంటి భద్రత సంబంధించిన యాప్ ఉండేదని.. అది మహిళలకు ఎంతో ఉపయోగపడిందని తెలిపారు. ఈ యాప్‌ని ఇప్పుడు బంద్ చేశారని.. డయల్ 100 పూర్తిగా ఫెయిల్ అయ్యిందని విమర్శించారు. మూడు నిమిషాల్లో గతంలో వచ్చిన పోలీసులు ఇప్పుడు 10 నుంచి 15 నిమిషాలు క్రైమ్‌సీన్‌కి రావడానికి టైం పడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం టెక్నాలజీని సరిగ్గా వాడడం లేదన్నారు. క్రైమ్ ఆక్సిడెంట్ జరిగినప్పుడు సెకండ్ టైం కూడా చాలా కీలకమని.. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో ఉన్నప్పుడు 15వేల నూతన వాహనాలను పోలీసులకు అందించారని గుర్తు చేశారు. ప్రతినెలా పోలీసులకు పోలీస్ స్టేషన్ అలవెన్స్ అందించారని.. పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారన్నారు. పోలీసుల ఆత్మగౌరవానికి భంగం వాటిల్లకుండా చర్యలు తీసుకున్నారన్నారు. ట్రాఫిక్ పోలీసులకు 30శాతం అదనంగా వేతనాలు పెంచారని.. రేవంత్ రెడ్డి పాలనలో క్రైమ్ డిటెక్షన్ రేట్‌లో తెలంగాణ బీహార్ రాష్ట్రాన్ని దాటిందని ఆరోపించారు. తెలంగాణ బతుకుదెరువును మారుస్తా అని చెప్పిన రేవంత్ రెడ్డి తెలంగాణ తల్లిని మారుస్తా.. తెలంగాణ లోగోని మారు స్తా.. పోలీసు లోగోని మారుస్తా అని చెప్పడం తప్పా చేసిందేమీ లేదన్నారు. పోలీసు లోగోలను మార్చుడు కాదు పోలీసులకు అవసరమైన సాంకేతికతను నిధులను అందించాలని చురకలంటించారు.

**రేవంత్‌రెడ్డి తీరుతో పోలీసులకు ఇబ్బందులు..**

రేవంత్ రెడ్డి తీరుతో రాష్ట్రంలో పోలీసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. కేసీఆర్ ప్రభుత్వం 15 రోజుల టీఏ ఇస్తే.. రేవంత్ రెడ్డి దాన్ని ఏడు రోజులకు తగ్గించాడన్నారు. రాష్ట్రంలో పోలీస్ కానిస్టేబుల్స్‌కు మూడు క్వాటర్ల సరెండర్ లీవులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌కు రూ.50వేల మెయింటెనెన్స్ డబ్బులు కేసీఆర్ ప్రభుత్వం అందించేదన్నారు. ఇప్పుడు ఆ డబ్బులు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం లేదని.. స్టేషన్ అలవెన్స్ విడుదల కావాలంటే కూడా సీఐ సెక్రటేరియట్‌లో పైరవీ చేస్తే తప్ప వచ్చే పరిస్థితి లేదన్నారు. ప్రతినెలా జీవితంలో రూ.300 ఆరోగ్య భద్రత కోసం పోలీసులు కడితే ప్రైవేట్ ఆస్పత్రిలో కూడా వారికి వైద్యం అందించే అవకాశం ఉండదన్నారు. ఆరోగ్య భద్రత ఆరోగ్యశ్రీ కంటే అధ్వాన్నంగా మారిపోయిందన్నారు. ఆరోగ్య భద్రత కార్డుతో పోలీసులు ఆసుపత్రికి వెళ్తే బెడ్లు ఖాళీగా లేవని పంపిస్తున్నారన్నారు. ఆరోగ్య భద్రత కార్డు కింద రాష్ట్రంలో ఈ సంవత్సరం ఎంత మంది పోలీసులకు చికిత్స అందించారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**బెనిఫిట్స్ ఇవ్వడం లేదు..**

రిటైర్డ్ అయిన పోలీసులకు రిటైర్మెంట్ డబ్బులు ప్రభుత్వం ఇవ్వడం లేదని.. హెూంగార్డ్‌లకు జీతం పెంచుతాం ఉద్యోగం పర్మినెంట్ చేస్తామని చెప్పి మోసం చేశారన్నారు. ఇచ్చే జీతం కూడా నెల పూర్తయితే గానీ రావడం లేదన్నారు.

## సంపాదకీయం

# ప్రతిష్టాత్మకం.. భారతరత్న

భారతరత్న పురస్కారం భారతదేశంలో పౌరులకు అందే అత్యుత్తమ పురస్కారం. పురస్కారం కళ, సాహిత్య, విజ్ఞాన, క్రీడా రంగాలలో అత్యుత్తమ కృషికి ప్రదానం చేస్తారు. భారతరత్న పురస్కారం అత్యున్నత స్థాయిలో ప్రదర్శించిన కృషికి/చేసిన సేవకు గుర్తింపుగా ఎటువంటి జాతి, వృత్తి, స్థాయి, లింగ బేధాలను పాటించకుండా ప్రదానం చేయబడుతుంది. పురస్కారానికి ఎంపిక చేయాల్సిన జాబితాను ప్రధానమంత్రి రాష్ట్రపతికి సిఫారసు చేయవలసి ఉంటుంది. ఇది జనవరి 2, 1954లో భారతదేశ మొదటి రాష్ట్రపతి డా. రాజేంద్ర ప్రసాద్ చేత పారంభింప బడింది. 1954, జనవరి 2వ తేదీన రెండు పౌర పురస్కారాలను ప్రారంభిస్తున్నట్లు భారత రాష్ట్రపతి యొక్క కార్యదర్శి కార్యాలయం నుండి ఒక ప్రకటన జారీ అయ్యింది. వాటిలో మొదటిది అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న కాగా రెండవది దానికన్నా తక్కువ స్థాయి గల మూడంచెల పద్మవిభూషణ్ పురస్కారం. పద్మవిభూషణ్ పురస్కారం ప్రథమ, ద్వితీయ, తృతీయ వర్గాలుగా విభజించారు. 1955, జనవరి 15న పద్మవిభూషణ్ పురస్కారాన్ని పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ అనే మూడు వేర్వేరు పురస్కారాలుగా పునర్వర్గీకరించారు. భారతరత్న పురస్కారం ప్రకటించినట్లు ఎన్ని ప్రకటనలు వెలువడినా, కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ వారు ప్రచురించే గెజిట్లో అధికారికంగా ప్రకటించిన తర్వాతనే ఈ పురస్కారం అధికారికంగా లభించినట్లు భావిస్తారు. పురస్కార గ్రహీతలకు రాష్ట్రపతి తన సంతకంతో కూడిన ఒక "సనదు (పట్టా), ఒక పతకం ప్రదానం చేస్తాడు. 1954 నిర్దేశాలు ప్రకారం 1 3/8 ఇంచుల (35 మిల్లీ మీటర్ల) వ్యాసార్థం కలిగిన వృత్తాకార బంగారు పతకాన్ని ఈ పురస్కార సమయంలో బహూకరిస్తారు. పతకం ముఖ భాగంలో సూర్యుని బొమ్మ ఉండి, కింది భాగంలో వెండితో "భారత రత్న" అని దేవనాగరి లిపిలో రాసి ఉంటుంది. వెనకవైపు మధ్యభాగంలో ప్లాటినం లోహంలో భారత చిహ్నం, కింది భాగంలో వెండితో భారత జాతీయ నినాదం "సత్యమేవ జయతే" అని రాసి ఉంటుంది. ఏడాది తరువాత దీని రూపాన్ని మార్చారు. అప్పుడు మార్చిన దానినే ఇప్పటికీ వాడుతున్నారు. ఇప్పటి మోడల్ ప్రకారం రావి ఆకు ఆకారంలో ఉండి 2 5/16 ఇంచులు (59 మి.మీ.) పొడవు, 1 7/8 ఇంచుల (48 మి.మీ.) వెడల్పు షుఅని 1/%8 ఇంచుల (మి.మీ.) మందం కలిగి ఉండి ప్లాటినం చట్రం కలిగి ఉంటుంది. పతకం ముందు భాగంలో మధ్యలో సూర్యుని బొమ్మ చిత్రీకరించబడి ఉంటుంది. ప్లాటినం లోహంతో తయారు చేసిన ఈ బొమ్మ 5/8 ఇంచుల (16 మి.మీ.) వ్యాసార్థం కలిగి ఉ ండి, సూర్యుని కేంద్ర బిందువు నుంచి 5/6 ఇంచులు (21 మి.మీ.) నుంచి 1/2 దాకా (13 మి.మీ.) కిరణాలు విస్తరించి ఉంటాయి. ముందుభాగంలో భారతరత్న అన్న పదాలు, వెనుక వైపు భారత జాతీయ చిహ్నం, నినాదం సత్యమేవ జయతే 1954 డిజైన్ లోనే ఉంచేశారు. మెడలో వేయడానికి వీలుగా 2 ఇంచ్ వెడల్పు, 51 ఎం.ఎం. గల తెలుపు రిబ్బన్ ను పతకానికి కడతారు. 1957లో, వెండి పూత మార్చి ఎండిన కాంస్యం వాడటం ప్రారంభించారు. భారత రత్న పతకాలను కలకత్తాలోని అలిపోర్ ప్రభుత్వ ముద్రణశాలలో ముద్రిస్తారు. పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ, పరమ వీర చక్ర, వంటి పౌర, సైనిక పురస్కారలకు ఇచ్చే పతకాలు కూడా ఇక్కడే ముద్రిస్తుంటారు. ఈ పురస్కారం క్రింద ఎలాంటి నగదు మంజూరు చేయరు. భారత రాజ్యాంగం యొక్క ఆర్టికల్ 18 (1) ప్రకారం ఈ పురస్కార గ్రహీతలెవ్వరూ తమ పేరు ముందు, వెనుక భారతరత్న అని పేర్కొనరాదు. భారతరత్న పొందిన పౌరులకు 7వ స్థాయి గౌరవం లభిస్తుంది (మొదటిది ఆరు – రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, రాష్ట్ర గవర్నర్లు, మాజీ రాష్ట్రపతులు, ఉపప్రధాన మంత్రి, ముఖ్య న్యాయాధీశులు). కానీ ఈ గౌరవం వలన ఎలాంటి అధికారాలు లేదా పేరు ముందు ప్రత్యేక బిరుదులూ రావు. సాధారణంగా భారతరత్న పురస్కార ప్రదాన సభ రాష్ట్రపతి భవన్, ఢిల్లీలో జరుగుతుంది. 1954 నాటి నిబంధనల ప్రకారం ఈ పురస్కారం కళలు, సాహిత్యం, విజ్ఞానం, ప్రజాసేవ రంగాలలో కృషి చేసినవారికి ఇచ్చేవారు. 2011, డిసెంబరులో ఈ నిబంధనలను మార్చి "మానవజాతి పాటుపడే ఈ రంగానికైనా" అనే పదాన్ని చేర్చారు. 1954 నాటి నిబంధనలు మరణానంతరం ఈ పురస్కారం ప్రకటించడాన్ని అనుమతించేవి కావు. కానీ 1955 జనవరిలో ఈ నిబంధనను సడలించారు. భారతరత్న పురస్కారం కేవలం భారతీయులకే ప్రదానం చేయాలన్న నిబంధన ఏమీ లేదు. ఈ పురస్కారాన్ని భారత పౌరసత్వం స్వీకరించిన మదర్ థెరీసాకు 1980లో, మరో ఇద్దరు విదేశీయులు ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాను 1987లో, నెల్సన్ మండేలాకు 1990లో ప్రదానం చేశారు. ఈ పురస్కారం రెండుసార్లు రద్దు చేయబడింది. మొదటి సారి మొరార్జీ దేశాయ్ ప్రధానమంత్రిగా గద్దెనెక్కిన తర్వాత 1977, జూలై 13వ తేదీన అన్ని పౌరపురస్కారాలను రద్దుచేశారు. తరువాత ఈ పురస్కారాలు 1980, జనవరి 25న ఇందిరాగాంధీ ప్రధాన మంత్రి అయిన తర్వాత పునురుద్ధరించబడ్డాయి 1992లో ఈ పురస్కారాల "రాజ్యాంగ సాధికారత"ను సవాలు చేస్తూ కేరళ, మధ్యప్రదేశ్ హైకోర్టులలో రెండు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు కావడంతో ఈ పురస్కారాలను రెండవసారి రద్దు చేశారు. ఈ వ్యాజ్యాలకు ముగింపు పలుకుతూ 1995 డిసెంబరులో సుప్రీం కోర్టు ఈ పురస్కారాలను మళ్ళీ పునరుద్ధరించింది. లెజెండరీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ కు తన 40వ యేట ఈ పురస్కారం లభించింది. ఈ పురస్కారం లభించినవారిలో ఇతనే అతి పిన్నవయస్కుడు, మొట్టమొదటి క్రీడాకారుడు. కానీ 1958, ఏప్రిల్ 18వ తేదీన బొంబాయిలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ధొండొ కేశవ కర్వేకు అతని 100వ జన్మదినం సందర్భంగా ఈ పురస్కారాన్ని అందజేశారు. ఆయన జీవించి ఉండగా ఈ పురస్కారం అందుకున్నవారిలో అతి పెద్ద వయస్కుడు. 1966లో లాల్ బహదూర్ శాస్త్రి మొట్టమొదటి సారి మరణానంతరం ఈ పురస్కారాన్ని పొందాడు. ఈ పురస్కారానికి ప్రతిపాదనలు చేసే పద్ధతి లేనప్పట్టికీ, ప్రధానమంత్రి మాత్రమే రాష్ట్రపతికి ఏడాదికి గరిష్ఠంగా ముగ్గురిని మాత్రం సిఫారసు చేయవచ్చు. కానీ 1999లో ఈ పురస్కారాన్ని నలుగురు వ్యక్తులకు ప్రదానం చేశారు. భారత రత్న పొందిన వారిలో సర్వేపల్లి రాధాకృష్ణన్ 1954, చక్రవర్తుల రాజగోపాలాచారి 1954, డా.సి.వి. రామన్ 1954, డా. భగవాన్ దాస్ 1955, డా. మోక్షగుండం విశ్వేశ్వరయ్య 1955, జవహర్ లాల్ నెహ్రూ 1955, గోవింద్ వల్లభ్ పంత్ 957, ధొండొ కేశవ కార్వే 1958, డా. బీ.సీ.రాయ్ 1961, పురుషోత్తమ దాస్ టాండన్ 1961, రాజేంద్ర ప్రసాద్ 1962, డా. జాకీర్ హుస్సేన్ 1963, పాండురంగ వామన్ కానే, 1963, లాల్ బహదూర్ శాస్త్రి (మరణానంతరం) 1966, ఇందిరాగాంధీ 1971, వీ.వీ.గిరి 1975, కే. కామరాజు (మరణానంతరం) 1976, మదర్ థెరీసా 1980, ఆచార్య వినోబా భావే (మరణానంతరం)1983, ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ 1987, యం.జి.రామచంద్రన్ (మరణానంతరం)1988, బి.ఆర్. అంబేద్కర్ (మరణానంతరం)1990, నెల్సన్ మండేలా 1990, రాజీవ్ గాంధీ (మరణానంతరం) 1991, సర్దార్ వల్లభాయి పటేల్, (మరణానంతరం) 1991, మొరార్జీ దేశాయి 1991, మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ (మరణానంతరం) 1992, జే.ఆర్.డీ. టాటా (1904–1993) 1992, సత్యజిత్ రే 1992, సుభాష్ చంద్ర బోస్ (తరువాత ఉపసంహరించ బడినది) 1992 ఏ.పి.జె. అబ్దుల్ కలామ్ 1997 గుర్జారీలాల్ నందా 1997, అరుణా అసఫ్ అలీ (మరణానంతరం) 1997, ఎం.ఎస్. సుబ్బలక్ష్మి 1998. సి.సుబ్రమణ్యం 1998, జయప్రకాశ్ నారాయణ్ 1998, రవి శంకర్ 1999, అమర్త్య సేన్ 1999, గోపీనాథ్ బొర్డొలాయి 1999, లతా మంగేష్కర్ 2001, బిస్మిల్లా ఖాన్ 2001, భీమ్ సేన్ జోషి 2008, సచిన్ టెండూల్కర్ 2014, సి. ఎన్. ఆర్. రావు 2014, మదన్ మోహన్ మాలవ్య 2015, అటల్ బిహారీ వాజపేయి 2015, ప్రణబ్ ముఖర్జీ 2019, నానాజీ దేశముఖ్ 2019, హజారిక 2019 తదితరులు ఉన్నారు.

# హరికథా పితామహుడు ఆదిభట్ల




తెలుగువారి కళాసాహిత్య సంగీత చరిత్రలో సువర్ణాధ్యాయాన్ని సృష్టించిన అపురూప కళారూపం హరికథ. కేవలం ఒక్క కళాకారుడు సంగీత, సాహిత్య, నృత్య, అభినయ కళాభినివేశంతో మృదంగం, వయోలిన్ వాద్య సహకారంతో శ్రోతలను ఆధ్యాత్మిక, కళాసాగరంలో ఓలలాడించే కళారూప సృష్టి హరికథ. సంగీతం, సాహిత్యం మరియు నృత్యాల మేళవింపుతో హరికథ ప్రక్రియని సృజించి 'హరికథా పితామహులుగా, కథావాగ్గేయకారులు'గా ప్రఖ్యాతిగాంచారు ఆదిభట్ల నారాయణదాసు. ఆయన ప్రాచీన వాగ్గేయకారుల కోవకు చెందినవారు. కవిత్వం, సంగీతం, నాట్యం అనే మూడు రంగాలలోనూ తనకున్న ప్రతిభను జోడించి నారాయణదాసు హరికథ అనే కళను అత్యున్నత శిఖరాలకు చేర్చారు. మూడింటి కలయికకూ భక్తి అనే భావం ప్రాణంగా హరికథలు రచన చేసి, తెలుగు నాటనే కాక ఇతర రాష్ట్రాలలో కూడా హరికథా ప్రదర్శనలిచ్చి ప్రజల మన్ననలను పొందిన కళాకారుడాయన. హరికథ' అనే పేరువింటే నారాయణదాసు, నారాయణదాసుగారు పేరువింటే 'హరికథ' తెలుగు రాష్ట్రములలో వెంటనే స్ఫురిస్తాయి. నారాయణదాసుగారు జగత్ప్రసిద్ధులైన హరికథ పితామహులు, కారణ జన్ములు, విద్వత్కవీంద్రులు, భక్తాగ్రణ్యులు. తాము జీవితంలో భక్తినీ, రక్తినీ, ముక్తినీ పుష్కలంగా పొంది తమను దర్శించిన వారికీ, విన్నవారికీ, శుశ్రూష ఒనర్చినవారికీ వాటిని ప్రసాదించిన మహానుభావులు. వేదశాస్త్ర పురాణేతిహాసాదులలోని సర్వసారజ్ఞులు. సంగీత, సాహిత్య, కవితా, నృత్య వాద్యములలో అసమాన ప్రజ్ఞాధురీణులు, కళాప్రపూర్ణులు, సర్వస్వతంత్రులు. శృంగారరస భరితులు, సరస్వతీ అంశ సంభవులు, గాన గంధర్వులు. హరికథారచనకు, ప్రచారానికి మార్గదర్శకులు. పంచముఖి, షణ్ముఖివంటి అసాధ్యములైన తాళములలో రచనలుచేసి, గానంచేసి విద్వాంసుల మన్ననలు పొందిన ఘనవిద్వాంసులు. సహజ పాండిత్య మండితులై సంగీతము, సాహిత్యము, నాట్యము, పాత్రాభినయము, కవిత్వము, వేదాంతము, వ్యాకరణము, జ్యోతిష్యము, ఆయుర్వేదము ఆది విద్యలలోబీ సంస్కృతము, ఆంధ్రము, హిందీ, ఉర్దూ, పారసీకము, అరబ్బీ భాషలయందు అసమానమైన పాండిత్యమును సంపాదించారు. తారకం, హరికథామృతం అనే సంస్కృత కావ్యాలను రచించి జర్మను పండితుల మెప్పు పొందారు. ఋగ్వేదాన్ని స్వర సహింతంగా అచ్చ తెనుగు లోనికి అనువదించి వేదంలోని విజ్ఞానాన్నీ, మంత్రమహిమని తెలుగువారికి తెలియచేసారు. ఆంగ్లభాషనుండి వివిధ కవుల రచనలు కొన్ని కొన్నిటిని విశ్లేషించి షేక్స్పియర్ నాటక రంగములోని ఘట్టములను హృద్యముగా తెలుగులోకి అనువదించారు. ఆయన గాత్ర నిస్వనంలో మైకు, లౌడ్ స్పీకర్లు సహజంగానే అమరి ఉన్నాయంటారు. కంఠం ఎత్తిపాడితే అయిదువేల శ్రోతలకైనప్పటికీ అవలీలగా అందే గాత్ర సౌలభ్యం ఉండేదట.శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు 1864 ఆగష్టు 31న ఆంధ్రప్రదేశ్ లోని నాటి పార్వతీపుర సమీప అజ్జాడ అనే గ్రామంలో (ప్రస్తుతం విజయనగరం జిల్లా) వేంకటచయన, లక్ష్మీనరసమాంబలకు జన్మించారు. ఆయన అసలు పేరు సూర్య నారాయణ. హరికథకుడిగా ప్రసిద్ధి చెందాక ఆయన నారాయణ దాసుగా మార్చుకున్నారు. ఏకసంధాగ్రహిగా, చిరు ప్రాయంలోనే పద్యాలు, శ్లోకాలు విని కంఠస్థం చేసేవారు. కేవలం ఐదేళ్ళ వయసులో నే భాగవతంలోని పద్యాలు ఎన్నో చెప్పేవారట.హరికథ అంటే ఏమిటో తెలియని కాలంలో తెలుగు రాష్ట్రములలో దాన్ని రుచి చూపడమేకాక పలువురికి ఉపదేశించిన మహెూపాధ్యాయులు. కవిత్వం చెప్పే నైపుణ్యంకూడా ఉండేది. పోతన భాగవతము వలన ప్రభావితులై, ఎన్నో హరికథలను రచించారు. కథాకాలక్షేపము విలక్షణ మైనది. స్వవిరచిత కథతో,

కవిత్వము, పాటలతో పామరులను సైతం చమత్కారమగు మాటలతోను మెప్పించేవారట. మైసూరు మహారాజు దర్బారులో తన వీణావాద్య కౌశల్యంచే మహారాజు మెప్పుపొంది సన్మానాలు అందుకొన్నారు. మహారాజు గాత్రాన్ని ఫోనో గ్రాముద్వారా రికార్డు చేయించుకొని తరచూ వినేవారట. విజయరామ గాన కళాశాల ప్రథమ ప్రధానాచార్య (1919లో) పదవిలో 17 ఏళ్లు పని చేశారు. జానకీశపథము, రుక్మిణీ కళ్యాణము, గజేంద్ర మోక్షము, ప్రహ్లాదచరిత్ర, ధ్రువోపాఖ్యానము, మార్కండేయోపాఖ్యానము, భీష్మ చరిత్రము, సావిత్రీ చరిత్రము, యదార్థ రామాయణము మున్నగు హరికథలు, హరికథలు రచించారు. పెక్కు శతకములను (శ్రీరామచంద్రశతకము, కాశీ శతకము), కావ్యములను (ఉమర్ ఖయాం, బాటసారి), జగజ్జ్యోతి అనే వేదాంత గ్రంథమును, తారకమను శృంగార ప్రబంధమును, 'నవరసతరంగిణి' అను సంగీతశాస్త్ర గ్రంథమును రచించినారు. భారత కోకిల' సరోజినీదేవి నాయుడు, 'విశ్వకవి' రవీంద్రనాథ్ ఠాకూర్, సుప్రసిద్ధ గాయనీమణి జానకిబాయీ, మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్, వంటి మహనీయుల ప్రశంసలనందుకొన్న ప్రతిభాశాలి. ఆయన రచించిన 'జానకీ శపథం' (ఉత్తర రామచరిత్ర) హరికథ ఒక సంగీత కళాఖండం. అందులో ఆయన పూర్వాంగ, ఉత్తరాంగములకు చెందిన 35 రాగాలను తీసి, వాటిలో కీర్తనలు వ్రాసారు. ఆ కీర్తనలు గానం చెయ్యడం సామాన్య సంగీత కళాకారులకు కష్ట సాధ్యం. కలకత్తానుండి కన్యాకుమారి వరకు దాసు దేశ పర్యటనలు చేసేవారు. చిన్న గ్రామాలు, పట్టణములు, సంస్థలు విద్వత్సభలలో, దేవాలయాలలో, రాజ దర్బారులలో, అంతఃపురాలలో దాసుగారు చేసిన హరికథా కార్యక్రమాలు వేలకువేలు ఉన్నాయి. సామాన్యులు మొదలుకొని ప్రతిభావంతులు, అష్టావధాన శతావధానులు చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి, కాశీ కృష్ణమాచార్యులు, జంధ్యాల పాపయ్యశాస్త్రి, సర్వేపెల్లి రాధాకృష్ణ (రాష్ట్రపతి)... ఒక్క రేమిటి అన్ని వర్గాల వారు వేలాద దాసుగారి హరికథా గానానికి, కవితాశక్తికి, సంగీత – లయల పాండిత్యానికి, ముగ్ధులై ఆనందిచేవారట. సుమారు ఆరున్నర దశాబ్దాల సంగీత, సాహిత్య, హరికథా కళా ప్రస్థానంలో ఆయన అందుకోని సన్మానం లేదేమో. రాజ సన్మానాలూ, పౌర సన్మానాలూ, బిరుదు ప్రదానాలూ, గజారోహణలు, సువర్ణ ఘంటాకంకణ ధారణలూ, గండపెండేర ధారణలూ ఇలా ఎన్నెన్నో గౌరవాలు ఆయనకు లభించాయి. దైవ సంకల్పమో, యాదృచ్ఛికమో గాని, త్యాగరాజు మరణించిన తిథి పుష్య బహుళ పంచమినాడే, 1945 జనవరి 2న, నారాయణ దాసు దేహాన్ని వదలి వెళ్లడం విశేషం.


# త్యాగానికి ప్రతిరూపం బత్తిని

బత్తిని మొగిలయ్య గౌడ్ ఓరు గల్లుకు చెందిన స్వాతంత్ర్య సమర యోధుడు. రజాకార్లను ఎదిరించి పోరాడి అమరుడైన వీరుడు. బత్తిని మొగిలయ్య గౌడ్ వరంగల్ తూర్పు కోట నివాసి. తల్లిదండ్రులు బత్తిని చెన్నమ్మ, మల్లయ్యలు, అన్న బత్తిని రామస్వామి గౌడ్... చెన్నమ్మ, మల్లయ్య దంపతుల ఐదవ సంతానంగా ఆ కాలపు దీరుడిగా ఖిల్లా ఓరుగల్లులో పాఠాలు నేర్చుకున్నాడు. మొగి లయ్య కోట బడిలో 4వ తరగతి వరకు చదివాడు. బత్తిని మొగి లయ్య గౌడ్, బత్తిని రామస్వామి గౌడ్ లిద్దరు ఆర్యసమాజ్ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనేవారు. అన్న రామస్వామి, భూపతి కృష్ణమూర్తి, ఇతర కాంగ్రెస్ వాదులతో కలిసి కాంగ్రెస్, ఆర్య సమాజ్ సమావేశాలకు వెళ్లేవాడు, అన్నదమ్ములు అన్ని విషయాలలో తోడుగా ఉంటూ, గౌడ కుల వృత్తి అయిన తాళ్లు ఎక్కతూ వ్యవ సాయం చేసేవారు. గౌడ్ల పరిస్థితి చాల దుర్భరంగా ఉండే నాటి పరిస్థితులలో, నిజాం ప్రభువు కల్లు మీద, తాడిచెట్ల మీద పన్నులు వసూలు చేయడాన్ని, పన్నులు కట్టని గౌడులకు విధించే శిక్షలను ఆయన జీర్ణించుకునే వాడు కాదు. నిజాం పోలీసులన్నా, రజాకార్లన్నా ఆయనకు తీవ్ర వ్యతి రేకత ఉండేది.స్వతంత్ర అభిలాషను విస్తృత పరిచే దిశగా పన్నెండవ జాతీ యాంధ్ర మహాసభలు 1946లో వరంగల్ లోని మడికొండలో జరిగాయి. రహస్యంగా కాంగ్రెస్ కార్యకర్తలు జాతీయ జెండా ఎగుర వేయాలనేది సభల ఉద్దేశం. నిజాం రాష్ట్రంలో త్రివర్ణ పతాకావిష్కరణ అధికారికంగా నిషేధించ బడింది. జెండా ఎత్తడం అంటే దెబ్బలకు, జైలుశిక్షకు, మరణానికి వెరవ కుండా చేసే సాహసోపేత కార్య క్రమమే. వరంగల్ కోటలో దేశభక్తి ప్రేరితులు అయిన యువకులు బత్తిని రామస్వామి గౌడ్, బత్తిని మొగిలయ్య గౌడ్, సంగరబోయిన కనకయ్య, సంగరబోయిన మల్లయ్య, నరిమెట్ల రామస్వామి, వడ్లకొండ ముత్తయ్య, పోశాల కనుకయ్య, ఆరెల్లి బుచ్చయ్య తదితరులు జెండా వందన కార్య క్రమాలను కోట ప్రజల సమక్షంలో నిర్వహించే వారు. స్టేట్ కాంగ్రెస్, కార్యకర్తలందరికి రహస్యంగా నైనా జెండా ఎగుర వేయాలనే ఆదేశా లిచ్చింది. స్టేట్ కాంగ్రెస్ ఆదేశాల మేరకు ప్రతి ఆదివారం వరంగల్ లోని చైతన్యం కలిగిన యువకులు, కాంగ్రెస్ నాయకులు, ఆర్యసమాజ్ కార్యకర్తలు వరంగల్ కోటలో జెండా ఎగుర వేసే వారు. 11 ఆగస్టు 1946 ఆదివారం రోజు ఉదయం7.30 గంటలకు వరంగల్ తూర్పు కోటలో జెండా ఎగుర వేయడానికి వరంగల్, హన్మకొండ నుండి వచ్చి, కాంగ్రెస్ నాయకులు యం.యస్. రాజలింగం, టి.హయగ్రీవాచారి, భూపతి కృష్ణమూర్తి, మడూరి రాజలింగం, బత్తిని సోదరులు కలిసి కార్య క్రమాన్ని నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు హయగ్రీవాచారి జెండాను ఎగురవేయగా, త్రివర్ణ పతాకం వందనం చేసి పిల్లలు పెద్ద లంతా జై కొట్టారు. అప్పుడే సుమారు రెండు వందల మంది రజాకార్లు, వారి అనుయాయులు మారణా యుధాలతో ఖాసీం షరీఫ్ అనే రజాకార్ నాయకుని అధ్వ ర్యంలో, జెండా ఎత్తిన నాయకులను చంపడానికి నిజాం అనుకూల నినాదాలను చేస్తూ జెండా ఎత్తిన ప్రాంతానికి చేరుకున్నారు. ఎగిరిన జెండాను చూసి, కోపం కట్టలు తెంచుకున్న రజాకార్లు, జెండాను దించి తొక్కి, తగలబెట్టి, అంతా కలిసి బత్తిని రామస్వామి గౌడ్ ఇంటి వైపు అరుస్తూ, తిడుతూ వెళ్ళారు. జెండా ఎత్తిన ప్రధాన




నాయకులైన హయగ్రీవ చారి, భూపతి కృష్ణమూర్తి, పంచాయతి హవల్దారు కె.సమ్మయ్య, వెంకట్రాం నర్సయ్య, యం.యస్.రాజలింగం వీరందరూ బత్తిని రామస్వామి ఇంట్లో కూడి, భవిష్యత్తు జెండా వందన కాంగ్రెస్ కార్యక్రమాల గురించి చర్చించు కుంటున్నారు. ఆ ఇంటి చుట్టూ మోహరించిన రజాకార్లు ఇంట్లోకి వెళ్ళి వాళ్లను చంపే ప్రయత్నం చేసారు. లోపల ఉన్న భూపతి కృష్ణమూర్తి కాంపౌండ్ కు గొళ్లెం పెట్టగా, రజాకార్లు రాళ్ళతో ఇంట్లోని వాళ్ళ మీద దాడి చేశారు. తలుపులు బద్దలు కొట్టి, జెండా ఎత్తిన నాయకులందరిని చంపాలని చూసారు. జెండా వందన కార్యక్రమంలో పాల్గొన్న మొగిలయ్య, అనంతరం తాళ్లెక్క డానికి తాటి వనానికి వెళ్లాడు. మొగిలయ్య భార్య లచ్చవ్వ 15 రోజుల బాలింత, పురిటి బిడ్డతో మంచంపై ఉంది. మొగిలయ్య భార్య లచ్చవ్వ, తల్లి చెన్నమ్మ ఈ దాడితో భీతిల్లి పోయారు. శని గారం పుల్లయ్య అనే ఆర్యసమాజ్ కార్యకర్త తాటి వనంలో ఉన్న మొగిలయ్యను కలిసి రజాకార్ల దాడి గురించి చెప్పాడు. దాడి గురించి విన్న మొగిలయ్య ఒక్క క్షణం నిశ్చేష్టుడై, మరుక్షణం తన ఇంటివైపు పరుగు తీసాడు. ఆ ఇంట్లో ఉన్న వాళ్లంతా వందల మంది రజాకార్ల చేతుల్లో చనిపోయే ట్టుగా ఉందని భావించి, తన ఇంటి వెనుక దర్వాజా నుండి రజాకార్ల కంటబడకుండ ఇంట్లోకి వెళ్ళి, మెరుపు వేగంతో ఇంటి సూరు లోని పదునైన కత్తిని తీసి, మెరుపులా రజాకార్ల మూకపై పడి యుద్ధం మొదలు పెట్టాడు. ఈ దాడికి నాయకత్వం వహించిన ఖాసీం షరీఫ్ తో సహా, రజాకార్లంతా చీమల పుట్ట చెదిరి నట్లుగా చెదిరి పోయారు. రజాకార్లు తిరిగి మొగిలయ్య పై మూకుమ్మడిగా రెండవ మారు దాడికి పాల్పడ్డారు. రెండవసారీ మొగిలయ్య వారిని తరిమివేశాడు, కానీ మూడవసారి దాడిలో ఖాసీం షరీఫ్ బల్లెంతో మొగిలయ్య వైపు వస్తున్నప్పుడు, మొగిలయ్య తన శత్రువును నరకడానికి తన ఎత్తిన కత్తిని తన ఇంటి ముందు గల పందిరి గుంజల మధ్య చిక్కుకుంది. ఇదే అదనుగా భావించిన షరీఫ్ తన బల్లెంతో మొగిలయ్య గుండెల మీద పొడిచాడు. అలా రజాకార్ల మూకుమ్మడి దాడిలో మొగిలయ్య అమరుడైనాడు.మొగిలయ్యను చంపిన ఖాసీం షరీఫ్ ని అతని అనుయాయులు, తమ భుజాలపై మోస్తూ ఇప్పటి వరంగల్ చౌరస్తాకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అప్పటి వరంగల్ తాలుకా దార్ (కలెక్టర్) అబ్దుల్ మొహిత్ మిల్ ఎదురేగి, హంతకు డైన ఖాసీం షరీఫ్ కు పూలమాల వేసి ఆలింగనం చేసుకున్నాడు. జెండా ఎత్తిన నాయకులకు ప్రాణభిక్ష పెట్టి, త్యాగనిరతి కి ప్రతిరూపంగా నిలిచి, 25 సంవత్సరాల వయస్సులోనే అమరుడైన నిష్కళంక దేశభక్తుడు బత్తిని మొగిలయ్య స్మృతి చిరస్మర ణీయంగా మిగిలి పోవాలని వరంగల్ నడిబొడ్డున గల జె.పి.ఎన్ రోడ్ లో 1954 లో మొగిలయ్య స్మారక భవనాన్ని ప్రజలు ఏర్పాటు చేసారు.

# సూర్య చంద్ర ఎంటర్ ప్రైజెస్ క్యాలెండర్ ఆవిష్కరించిన పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్,జనవరి 01(సూర్యరేఖ)**ంగ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ చెందిన సంస్థ సూర్య చంద్ర ఎంటర్ ప్రైజెస్ క్యాలెండర్ ను బుధవారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ...సూర్యచంద్ర ఎంటర్ప్రైజెస్ సంస్థ ఈ సంవత్సరంలో మరింత పురోగతిని సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీజీ.సుదర్శన్, టీ.శ్రీకాంత్ రెడ్డి,డి. రాజుగౌడ్,కె.రాజేష్, ఎన్.సురేష్, హెచ్.మహేష్, నర్సింహా, సంపత్, మైతిల్, పవన్,హరి, యాసీన్,సాయి,రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కోదండరాం కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన జన సమితి నేతలు



**ఉప్పల్,జనవరి 01(సూర్యరేఖ)**తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు శాసనమండలి సభ్యుడు ప్రొఫెసర్ కోదండరాంకు తెలంగాణ జన సమితి నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నరసయ్య, ముషీరాబాద్ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్ యాదవ్ కోదండ కలిసి పుష్పగుచ్ఛమిచ్చి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కుమ్మరి సంఘం నాయకుడిని పరామర్శించిన ఎంపీఆర్



**ఉప్పల్,జనవరి 01(సూర్యరేఖ)** రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఉప్పల్ కుమ్మరి సంఘం నాయకుడు గుమిడెల్లి కృష్ణను ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి పరామర్శించారు. ఉప్పల్ కుమ్మరి బస్తి చెందిన గుమిడెలి కృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పరమేశ్వర్ రెడ్డి,రాఘవేందర్ గుప్తా,హనుమంత్, స్వీట్ హౌస్ రాజు,నరేష్,సాయి,కృష్ణ నివాసానికి వెళ్ళి పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

## సీఎం రేవంత్ రెడ్డికి కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన చిలుక మధుసూధన్ రెడ్డి



**ఇబ్రహింపట్నం, జనవరి1 (సూర్య రేఖ)** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని బుధవారం జూబ్లీ హిల్స్ లోని తన నివాసంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈసందర్భంగా నూత నంగా చేపట్టబోయే నూతన మార్కెట్ పనులకు త్వరగా ఆమోదం తెలపాలని నూతన మార్కెట్ కి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరటం జరిగింది. అనంతరం ముఖ్య మంత్రి తప్పకుండా కేటాయిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. అదేవిధంగా ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి,భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డిని కూడా మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీ లక్ష్మీగణపతి నాగదేవత ఆలయంలో ఘనంగా శ్రీ అయ్యప్ప స్వామి పడిపూజ




**అయ్యప్ప స్వామి యాత్రకు బయలుదేరిన స్వాములు..**

**ఉప్పల్,జనవరి 01(సూర్యరేఖ)** ఉప్పల్ సౌత్ స్వరూప్ నగర్ శ్రీ లక్ష్మీగణపతి నాగదేవత ఆలయం అయ్యప్ప స్వాములు పెద్ద ఎత్తున శ్రీ అయ్యప్ప స్వామి పడిపూజ నిర్వహించి ఇరుముళ్ళు కట్టుకొని శబరి అయ్యప్ప స్వామి యాత్రకు బుధవారం బయలుదేరారు.వెయ్యి మందికి పైగా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమం టి. రమణ గురుస్వామి సన్నిధాన ఆధ్వర్యంలో జరిగాయి.సురేష్ మాధవ్,రమణ, శ్రీనివాస్,ఇంకా గురుస్వాములు వైభవంగా ఇరుముడులు కట్టుకొని అయ్యప్ప సన్నిధికి బయలుదేరారు. అయ్యప్ప పడిపూజను బ్రహ్మశ్రీ అయినవోలు మల్లికార్జున శాస్త్రి లక్ష్మీ గణపతి ఆలయ ప్రధాన అర్చకులు పూజా నిర్వహించారు. గురుస్వాములు ఇరుముళ్ళు కట్టారు.

## తిరుమలనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ - 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి




**పాల్గొన్న కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్,మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి**

**ఉప్పల్,జనవరి 01 (సూర్యరేఖ)** మీర్ పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ లోని తిరుమలనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్,మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి,లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్షులు మల్లేష్ గౌడ్,అమరేంద్ర బాబు,వెంకన్న గౌడ్, రాంప్రదీప్, శ్రీనివాస్,జై సింగ్ ఠాకూర్, కృష్ణమోహన్, మురళికృష్ణ, కృష్ణమూర్తి,సీహెచ్ రాజు, బీడీదాస్,డీఎల్ ప్రసాద్,శేఖర్, కర్ణాకర్,రఫీక్,రమణ గుప్తా, శివ కుమార్ గుప్తా,రంగ సాయి,నారాయణ, రవి ప్రభు, జైపాల్ నాయుడు, బాలరాజు,రామకృష్ణ, వసంతరావు, నరసింహగౌడ్,హరినాథ్ రెడ్డి,నవీన్, భూపాల్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన పెండ్యాల సాయి మాలిక్




**రాజేంద్రనగర్,జనవరి 01** నూతన సంవత్సరం సందర్భంగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ని శ్రీనివాస సేవా సమితి చైర్మన్ పెండ్యాల సాయి మాలిక్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలని అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖశాంతులతో ఆనందంగా ఉండాలని ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ఆకాంక్షించారు. గత ఏడాదిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి నూతన సంవత్సరంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టే విధంగా కృషి చేస్తానని,నూతన సంవత్సరంలో ప్రజలు ఆశీస్సులు దీవెనలు అందిస్తారని ఆశిస్తూ ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో రహ్మత్ ఖాన్,రోహిత్,అరుణ్ యాదవ్,రాహుల్ తదితరులు ఉన్నారు.

## డిసెంబర్ 31 ఏరులై పారిన వరుద్యం..




**హైదరాబాద్,జనవరి 01(సూర్యరేఖ)**కొత్త సంవత్సరం వస్తుందన్న ఆనందంలో మందుబాబులు తెగ మద్యం తాగేశారు. తెలంగాణ ఎక్సైజ్ శాఖ చరిత్రలోనే డిసెంబర్ 31 రికార్డ్ స్థాయిలో రూ 403 కోట్ల మద్యం విక్రయాలు జరిగినట్లు తెలిపారు. ఇక డిసెంబర్ 28 నుండి జనవరి 1 ఉదయం వరకు రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా రూ 1800 కోట్ల విలువైన లిక్కర్ తాగారని తెలంగాణ ఎక్సైజ్ శాఖ తెలిపింది. గతంతో పోలిస్తే ఈ గణాంకాలు భారీగా పెరిగినట్లు వారు పేర్కొన్నారు. ఇక జనవరి ఫస్ట్ కూడా సెలవు దినం కావడంతో రాత్రి వరకు మద్యం అమ్మకాలు మరింత పెరిగే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ అంచనా వేస్తుంది.

## హైదరాబాదులో 1184 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు..



**హైదరాబాద్,జనవరి 01(సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు హెచ్చరికలు జారీ చేసినా మందుబాబులు మళ్లీ రోడ్ల మీదకు వచ్చి డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పోలీసులకు చిక్కారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా హైదరాబాద్‌లో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ క్రమంలో పలు చోట్ల ట్రాఫిక్ పోలీసులతో మందుబాబులు వాగ్వాదానికి దిగారు. హైదరాబాద్ వ్యాప్తంగా 1184 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. ఈస్ట్ జోన్‌లో అత్యధికంగా 236 కేసులు నమోదు కాగా..సౌత్ ఈస్ట్ జోన్‌లో 192,వెస్ట్ జోన్‌లో 179 కేసులు,సౌత్ వెస్ట్ జోన్‌లో 179 కేసులు,నార్త్ జోన్‌లో 177 కేసులు,సెంట్రల్ జోన్‌లో 102 కేసులు నమోదైనట్టు పోలీసులు తెలిపారు. హైదరాబాద్‌లోని వెంగళరావు పార్క్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఓ వ్యక్తి పట్టుబడ్డాడు. పోలీసుల టెస్టులో భాగంగా అతడికి 550 పాయింట్లు వచ్చినట్టు పోలీసులు నిర్ధారించారు. మరోవైపు..రోడ్ల మీద పోలీసుల తనిఖీలను చూసిన మందుబాబులు బైక్‌లను వదిలేసి పారిపోయే ప్రయత్నం చేయడంతో పోలీసులు వారిని పట్టుకొని కేసులు నమోదు చేశారు.

## ప్రజా పాలన దరఖాస్తులో గందరగోళం..



**హైదరాబాద్,జనవరి01(సూర్యరేఖ)** ఆత్మకూరు మండలం నీరుకుళ్ళ గ్రామంలో ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకొని అధికారికంగా రసీదు తీసుకున్న వంగేటి అన్నపూర్ణ ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో ఆన్లైన్లో తన పేరు నమోదు కాకపోవడం పట్ల అధికారుల నిర్లక్ష్యంపై ఆవేదన వ్యక్తం చేశారు. గత పది సంవత్సరాలుగా అద్దె ఇంట్లో ఉంటూ సొంత ఇల్లు లేక ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్న ఆన్లైన్లో తన పేరు నమోదు కాకపోవడం పట్ల ఆమె కన్నీటి పర్యాంతమయ్యారు. ఈ విషయానికి అధికారుల నిర్లక్ష్యం కొట్టినట్టు కనబడుతుంది. దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు ఆన్లైన్లో నమోదు కాకపోవడం ప్రజా పాలన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకువచ్చిన అధికారిక వెబ్ సైట్ లో పేర్లు మిస్ అవ్వడం వెనక ఆంతర్యం ఏమిటి అర్థం కావడం లేదు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని తమకు న్యాయం చేయాలని వంగెటి అన్నపూర్ణ కలెక్టర్,ప్రభుత్వ పెద్దలను కోరారు.

## మత్తు పదార్థాలపై కళాబృందంచే అవగాహన..



**నిజాంపేట,జనవరి1(సూర్యరేఖ)** మండల పరిధిలోని బచ్చు రాజుపల్లి గ్రామంలో బుధవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని కళాబృందంచే గ్రామస్తులకు ఆట పాటలతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... యువత మత్తు పదార్థాలకు బానిసలై పెడదారిన పడుతున్నారని, వారిని అలవాట్లు పడద్దని చెడు అలవాట్లు మానాలని తల్లిదండ్రులకు ఆసరాగా ఉండాలని అల్లరిస్తూ ఆట పాటలతో అవగాహన కల్పించామన్నారు. గ్రామస్తులు కళాకారుల ఆట పాటలను తిలకించారు. ఈ కార్యక్రమంలో కళాకారుల బృందసభ్యులు, గ్రామస్తులు,తదితరులు,పాల్గొన్నారు.

# కేటీఆర్,బండారి లక్ష్మారెడ్డిలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్





**ఉప్పల్,జనవరి 01(సూర్యరేఖ)** చిలుకనగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ బుధవారం తెలంగాణ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్,సిరిసిల్ల ఎమ్మెల్యే మాజీ మంత్రివర్యులు కేటీఆర్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర భవన్ లో ఉప్పల్ శాసన సభ్యులు బండారి లక్ష్మారెడ్డితో కలిసి కేటీఆర్ కి అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక అర్చన చేయించిన భగవంతుని చందనంతో కూడిన బొట్టును వారికి పెట్టారు.అనంతరం కేటీఆర్ ని శాలువాతో సత్కరించి పూల బొకేను అందించి 2025 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేటీఆర్ వారితో మాట్లాడుతూ... కార్యకర్తలందరికీ బీఆర్ఎస్ పార్టీ అండదండలు ఉంటాయని,ఎవరు కూడా అధైర్య పడవద్దని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను అనుక్షణం ప్రజలకు వివరిస్తూ వారి పాలన అంతమయ్యేంతవరకు ప్రతి ఒక్కరూ సైనికులుగా పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి కంటెస్టెడ్ ఎంపీ రాగిడి లక్ష్మారెడ్డి,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొకొండ జగన్,తిప్పని సంపత్, శ్యామ్, జిల్లాల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా న్యూఇయర్ వేడుకలు ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి..




**నిజాంపేట,జనవరి01(సూర్యరేఖ)** మండల కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి కొత్త సంవత్సర వేడుకలు మండలంలో ప్రశాంతంగా జరుపుకున్నారని ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.హైదరాబాద్ టాక్సీ డ్రైవర్ ల మాదిరి నిజాంపేట ఆటో యూనియన్ సభ్యులు ఆటోలను ఏర్పాటు చేయడంతో యూనియన్ సభ్యులను అభినందించారు.మండలంలో ప్రత్యేకంగా చెక్ పోస్టులను ఏర్పాటు చేసి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేపట్టామన్నారు. అలాగే నిజాంపేట మండల ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈ సంవత్సరం అందరికి మంచి జరగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ జైపాల్ రెడ్డి,హెడ్ కానిస్టేబుల్ సునీత,నరహరి,మహేష్, సోహెల్, రజాక్, నవీన్, వినోద్, ఏగొండ,ఆటో డ్రైవర్ తాడెం మల్లేశం,అబ్దుల్ పాషా,తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సరం సందర్భంగా కిటకిటలాడిన ఆలయాలు..




**నిజాంపేట,జనవరి 01(సూర్యరేఖ)** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని నిజాంపేట మండల వ్యాప్తంగా ఉన్నటువంటి ఆలయాలు కిటకిటలాడాయి.ఈ మేరకు నిజాంపేట మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన రేణుక ఎల్లమ్మ ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున తరలి అమ్మవారిని దర్శించుకున్నారు. రేణుక ఎల్లమ్మ తల్లి కృపతో ఈ సంవత్సరం సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు సుభిక్షంగా పండాలని మండల ప్రజలంతా అష్ట ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి బజార్ అంజా గౌడ్,గందే లింగమూర్తి,విగ్నేష్,వెల్దుర్తి వెంకటేష్ గౌడ్,చంద్రకాంత్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే జలీల్ పాషా ఆధ్వర్యంలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు..




**ఉప్పల్,జనవరి 01(సూర్యరేఖ)** ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎంఏ.జలీల్ పాషా ఆధ్వర్యంలో రామంతపూర్ శ్రీనగర్ కాలనీలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. నూతన సంవత్సర సందర్భంగా కాలనీవాసులంతా ఐక్యంగా నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.ఈ సందర్భంగా ఎంఏ.జలీల్ పాషా మాట్లాడుతూ...2025వ సంవత్సరం అందరు జీవితాల్లో నూతన ఉత్తేజను నింపి ఆయురారోగ్యాలతో అందరూ జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జంగారెడ్డి, రాములు యాదవ్, శంకర్, చెంచులు వెంకటేశ్వర్ ఆధ్య సుమిత్, సాయి, సైదులు, వహీద్, వాహీం, ఇస్మాయిల్, మోయిన్,చోటు లడ్డు,చింటూ, తదితరులు పాల్గొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# మహాత్మాగాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలి

**ఉప్పల్ భారత యువజన సంఘం మహాత్మా గాంధీ కాలుష్య విగ్రహం పునఃప్రతిష్ట..**

**ఎంపీ ఈటల రాజేందర్,ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**





**ఉప్పల్,జనవరి 01(సూర్యరేఖ)** మహాత్మాగాంధీ ఆశయసాధనకు కృషి చేయాలని మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ అన్నారు.ఉప్పల్ భారత యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం మహాత్మా గాంధీ కాంస్య విగ్రహం పునఃప్రతిష్ట ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది.మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిలు ముఖ్య అతిథులుగా విచ్చేసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. సత్యం,అహింసా మార్గంలో ఏదైనా చేయగలం,సాధించగలం అని నిరూపించిన వ్యక్తి మహాత్మా గాంధీ అని పేర్కొన్నారు. గాంధీజీ ప్రపంచానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. గ్రామాలు అభివృద్ధి చెందాలని గాంధీజీ కలలు కనేవారు. గాంధీ కలలుకన్న గ్రామ స్వరాజ్యాన్ని ప్రధాని నరేంద్ర మోడీ నిజం చేస్తున్నారు.ఉప్పల్ అంటేనే గుర్తొచ్చేది భారత యువజన సంఘం అని,భారత యువజన సంఘం ఆధ్వర్యంలో మరెన్నో కార్యక్రమాలు ముందు కొనసాగాలని ఆకాంక్షించారు.మాజీ ఎమ్మెల్యేలు ఎన్ విఎస్ఎస్ ప్రభాకర్, బేతి సుభాష్ రెడ్డి,బీఆర్ఎస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, బన్నాల ప్రవీణ్,గంధం నాగేశ్వరరావు,పసుల ప్రభాకర్ రెడ్డి,మేకల శిల్పా రెడ్డి,తాడూరి శ్రీనివాస్ ఆవిష్కరణ ఆహ్వానితులుగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ గ్రామ పెద్దలు, కన్వీనర్లు మేకల శివారెడ్డి,దుబ్బా నరసింహా రెడ్డి, భారత యువజన సంఘం ఇంచార్జ్ అధ్యక్షులు బజార్ అర్జున్ గౌడ్,సల్లా రాజిరెడ్డి,గుమ్మడెల్లి నారాయణ,బజార్ బద్రీనారాయణ గౌడ్,బజార్ జగన్నాథ్ గౌడ్,బిక్కుమల అంజయ్య, రమేష్ మహంకాళి లక్ష్మణ్,నరసింహ,బజార్ కృష్ణగౌడ్, బజార్ రాంరాజ్ గౌడ్,సల్ల రాజిరెడ్డి,ముష్యం శ్రీనివాస్,మేకల మధుసూధుడు,బజార్ మురళి కృష్ణ గౌడ్, చింతల నరసింహ, రాజవర్ధన్,బండి నరసింహా రెడ్డి, బజార్ ప్రేమ్ కుమార్ గౌడ్,రెడ్డిగారి దేవేందర్ రెడ్డి,బజార్ వేణు గోపాల్,బజార్ సురేష్,భుజేందర్ గౌడ్,కృష్ణగౌడ్,అన్న బాలకృష్ణ,రావుల శ్రీనివాస్,రాజ్ కుమార్ గౌడ్, శ్రీనివాస్, శేఖర్,విశ్వనాథ్, సునీల్,బోరంపేట రామరాజు,తధితరులు పుర ప్రముఖులు పెద్దమనుషుల కమిటీ సభ్యులు, యువకులు, వివిధ రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన సదస్సు కల్పించిన చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి



**చేగుంట,జనవరి 01(సూర్యరేఖ)** సైబర్ నేరాల పట్ల ప్రజలు,యువత పూర్తిగా అవగాహన కలిగి ఉండి,తగు జాగ్రత్తలు తీసుకోవాలని చేగుంట ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి అన్నారు.మెదక్ జిల్లా చేగుంట మండలం కర్నాల్ పల్లి గ్రామంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కర్నూల్ పల్లి ఎల్లమ్మ దేవాలయంలో సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్మించారు.ఈ సందర్భంగా వాహదారులకు,స్థానికులకు సైబర్ క్రైమ్ పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ. ప్రజలు తమ వ్యక్తిగత,బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు.ఫోన్‌లలో ఓటీపీ, ఓఎల్ఎక్స్,పేటీఎం, గూగుల్ పే,ఫోన్ పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేయాలని సూచించారు.లేదంటే సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 ట్రోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సత్యం,కానిస్టేబుల్ రాజు, కానిస్టేబుల్ విఠల్,తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ మినీ శిల్పారామంలో అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన





**ఉప్పల్,జనవరి 01(సూర్యరేఖ)** ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా బుధవారం గీతాంజలి శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది.వినాయక కౌతం, జనుత శబ్దం,మూషిక వాహన,భాగ్యత లక్ష్మి, ముద్దుగారే యశోద, రామ, రామ,లవకుశ,శుద్ధబ్రహ్మ, ముందుక శబ్దం, శ్రీనివాస కళ్యాణం,అష్టలక్ష్ములు, పలుకే బంగారమాయెన,నర్సింహా కౌతం మొదలైన అంశాలకి ప్రాధాన్య, శ్రీనిక,హరిణి,సహస్ర,ప్రాణవికా, శ్రీహిత, జాహ్నవి, యక్షిణి, ధన్విత,పూజిత మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్





**రాజేంద్రనగర్,జనవరి 01** నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాం క్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొద్దిసేపు ముఖ్యమంత్రితో అభివృద్ధిపై చర్చించారు.ఈ కొత్త సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితంలో శుభ సంతోషాలను నింపాలని సీఎం ఆకాంక్షించారు

## నాస్ ఫెలోషిప్ కు డాక్టర్ జి.వెంకటేశ్వర్లు ఎంపిక



**రాజేంద్రనగర్,జనవరి01** దేశంలో ప్రతిష్టాత్మకమైన నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ ఫెలోగా నారం మాజీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జి వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. వ్యవసాయ రంగం,మత్స్య రంగంలో ప్రతిభ కనబరిచినందుకు గాను ఆయనకు ఈ అవకాశం దక్కింది.గతంలో ఆయన నారంలో చేరడానికి ముందు ఐసిఏఆర్ ఎడ్యుకేషన్ డివిజన్లో అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ గా,ముంబైలోని సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ఎడ్యుకేషన్ లో సీనియర్ సైంటిస్ట్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చర్ రీసెర్చ్ బెంగళూరులో పనిచేశారు.ఆయన తెలంగాణలోని నల్గొండ జిల్లా నకిరేకల్ గ్రామంలో జన్మించారు.ఈ మేరకు తోటి సహచరులు,సిబ్బంది,ఐసిఏఆర్ శాస్త్రవేత్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

# మున్సిపల్ అధికారుల అద్దె కోసం కక్కుర్తి..





**మందు పార్టీ అడ్డాగా మారిన ఉప్పల్ మున్సిపల్ స్టేడియం..**
**ఈవెంట్ నిర్వాహకుల నిర్లక్ష్యం..గ్రౌండ్ నిండా మందు బాటిలు ..,చెత్తాచెదారం**
**కార్పొరేటర్లు ఈ వైనంపై స్పందించకపోవడం శోచనీయం..**

**ఉప్పల్,జనవరి 01(సూర్యరేఖ)** మున్సిపల్ అధికారుల అద్దె కోసం కక్కుర్తి మూలంగా ఉప్పల్ మున్సిపల్ స్టేడియం మందుబాబుల పార్టీ అడ్డాగా మారిపోయింది.ఈవెంట్ కు అద్దెకిచ్చే ముందు కార్యక్రమాల వివరాలు తెలుసుకోకుండా అద్దెకివ్వడం పట్ల వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో చెత్త చెదారంగా మారి,ఖాళి మందు బాటిల్ తో దర్శనమిచ్చింది. ఉప్పల్ జీహెచ్ఎంసీ గ్రౌండ్ మంగళవారం రాత్రి ట్రైవ్ ఈవెంట్ ద్వారా న్యూ ఇయర్ వేడుకలు జరిగాయి. న్యూ ఇయర్ కి వెల్కమ్ చెప్పడానికి భారీగా యువత తరలివచ్చారు. ఈవెంట్ కండక్ట్ చేసిన ఆర్గనైజర్స్ ఉప్పల్ జీహెచ్ఎంసీ గ్రౌండ్ లో చెత్తాచెదారం, మందు బాటిళ్లు,వేస్టేజ్ అలానే వదిలేసి వెళ్లారు.ఉదయం వరకు కూడా లైట్స్ ఆన్ లోనే ఉన్నాయి.జీహెచ్ఎంసీ అధికారులు అద్దె కోసం కక్కుర్తి పడ్డారు.శుభ్రత విషయంలో జోక్యం చేసుకోలేదని ఉదయం వాకింగ్ చేసే వాకర్స్ నుంచి విమర్శలు వెలువెత్తుతున్నాయి. ప్రభుత్వానికి చెందిన జీహెచ్ఎంసీ గ్రౌండ్ లో మందుతో కూడిన ఈవెంట్లకు పర్మిషన్ ఇవ్వడంపై ఉప్పల్ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మున్సిపల్ అధికారులు ఓ ప్రైవేట్ సంస్థకు అద్దెకిచ్చినప్పుడు డీజే వాడి వివాదాలకు కారణమైంది అయినా అధికారులు మార్పు రాలేదు. ఈవెంట్ నిర్వహించిన నిర్వాహకులు ఎక్సైజ్ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని తెలుస్తోంది. బహిరంగంగా అర్ధరాత్రి వరకు గ్రౌండ్లో మద్యం సేవిస్తున్న అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడం పట్ల పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.ఉప్పల్ మున్సిపల్ గ్రౌండ్లో ఇంత తతంగం జరిగిన కార్పొరేటర్లు పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ఘనంగా స్వర్గీయ ముత్యంరెడ్డి 80వ జయంతి వేడుకలు

**చేగుంట,జనవరి 01(సూర్యరేఖ)**దమెదక్ జిల్లా చేగుంట మండల పట్టణ కేంద్రంలోని గాంధీ చౌరస్తాలో మాజీ చెరుకు ముత్యంరెడ్డి 80వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్,పార్టీ శ్రేణులు వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్ మాట్లాడుతూ. చెరుకు ముత్యం రెడ్డి రైతు కాబట్టి,రైతులు పడే కష్టాలను చూసి ప్రభుత్వం నుండి ప్రోత్సాహకాలు, సహాయ సహకారాలు అందించారని తెలిపారు. రైతులకు కరెంటు కష్టాలు తొలగించి,సబ్సిడీలు అందించి,నూతన వ్యవసాయ పద్ధతులను తీసుకువచ్చి రైతులకు అధిక దిగుబడి,లాభాలు వచ్చే విధంగా చేశారని తెలిపారు.దుబ్బాక నియోజకవర్గంను అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచారని వివరించారు.నిరంతరం ప్రజల మధ్య ఉండి వారి కష్టసుఖాల్లో పాలుపంచుకొని నిస్వార్ధ ప్రజా నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న మహా నేత చెరుకు ముత్యంరెడ్డి,రైతు బాంధవుడుగా,అభివృద్ధి ప్రదాతగా పేదల పెన్నిధిగా చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మసాయి పేట్ శ్రీనివాస్,వివిధ సంఘాల నాయకులు, యూత్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలి..

## కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలను కాపాడాలి

## సిపిఎం జెండా ఆవిష్కరణలో పగడాల యాదయ్య

**రాజేంద్రనగర్,జనవరి 01** ప్రజల సమస్యల పరిష్కారమే సిపిఎం పార్టీ ప్రధాన కర్తవ్యమని రంగారెడ్డి జిల్లా సిపిఎం పార్టీ ప్రధాన కార్యదర్శి పగడాల యాదయ్య స్పష్టం చేశారు.సమస్యల పరిష్కారానికి ఎంత దూరమైనా వెళ్లి పరిష్కరించేందుకు చొరవ చూపుతామని వివరించారు. బుధవారం రాజేంద్రనగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో అరాంఘర్ చౌరస్తాలో మండల కమిటీ సభ్యులు కాలే రాజు అధ్యక్షతన సిపిఎం పార్టీ జెండాను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య ముఖ్యఅతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.సిపిఎం పార్టీ జెండా నిరంతరం ప్రజల పక్షాన నిలబడి పనిచేస్తుందని అన్నారు.దేశంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పేదవాళ్లను దోచుకొని పెద్దవాళ్ళకు దోచిపెడుతుందని అన్నారు. విద్య ఉపాధి వైద్యం పేద ప్రజల నిర్మూలనకు చొరవ చూపాల్సిన కేంద్రం ఆ దిశగా అడుగులు వేయడం లేదని అన్నారు.ఇంకా ప్రభుత్వ భూములు కబ్జాలకు గురైన స్పందించే పరిస్థితి కనిపించడం లేదని ఆరోపించారు.గత బిఆర్ఎస్ హయాంలో ఎన్నో ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని అన్నారు.దీంతోపాటు కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని అన్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని, వారికి న్యాయం చేయాలని అన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డులో ఏర్పాటు చేసి పదిలక్షల ఇన్సూరెన్స్ వసతి కల్పించాలని అన్నారు. విద్యార్థులు చదువుకొని ఉపాధి లేక పరిశ్రమలలో కార్మికులుగా ట్రాన్స్పోర్ట్ కార్మికులుగా పనులు చేస్తున్నారని అన్నారు.వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జాజాల రుద్రకుమార్, మండల కమిటీ సభ్యులు ఎస్ రామ్మోహన్రావు,ఎన్ జంగయ్య, బచ్చలకూర స్వామి, భాస్కర్, అరంఘర్ చౌరస్తా ఆటో ట్రాన్స్ పోర్ట్ యూనియన్ అధ్యక్షులు ఇమ్రాన్ ఖాన్, జాంగిర్,శివ నాయక్, శ్రీనివాస్, యాదగిరి, అనిల్,దేవర, నరసింహ, సలీం యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రొడ్యూసర్ దిల్ రాజును మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ మూవీ టీవీ అండ్ డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ కమిటీ సభ్యులు



**రాజేంద్రనగర్,జనవరి01** ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రముఖ ప్రొడ్యూసర్ ఎఫ్ డీసి చైర్మన్ దిల్ రాజును తెలంగాణ మూవీ టీవీ అండ్ డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.యూనియన్ కు సంబంధించిన పలు అంశాలపై దిల్ రాజుకు వినతిపత్రాన్ని అందజేశారు.ఈ మేరకు దిల్ రాజ్ సానుకూలంగా స్పందించారు. దిల్ రాజును కలిసిన వారిలో అధ్యక్షులు ఏ.రాజశేఖర్,ఆల్ కమిటీ చైర్మెన్ నందూరి రాము,ప్రధాన కార్యదర్శి బీ.నూకరాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కేపీ రెడ్డి,సంయుక్త కార్యదర్శి కే.రామ్మోహన్,ఈసీ సభ్యులు ఆకెళ్ళ గోపాలకృష్ణ వర్షిత,కందుల శివ,క్యాస్టింగ్ కమిటీ సభ్యులు,పరమేష్ తాందారి,ఇతర కమిటీ సభ్యులు,సాధారణ సభ్యులు పాల్గొన్నారు.

## మతిమరుపు రేవంత్ రెడ్డిని గద్దె దింపుతాం

**- హరీష్ రావు**



**హైదరాబాద్,జనవరి01(సూర్య రేఖ)** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మతిమరుపు వచ్చినట్టు ఉందని మాజీ మంత్రి,ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు.షరతులు పెట్టి చాలామంది రైతులకు రుణమాఫీ ఎగ్గొట్టారని ఆయన విమర్శించారు.రైతు భరోసా విషయంలో పది ఎకరాలకి ఇస్తామని,ఒక పంటకి ఇస్తామని ప్రభుత్వం లీకులు చేస్తుందని ఆయన ఆరోపించారు.కోతలు పెట్టేందుకు ప్రభుత్వం కుస్తీ పడుతుందని హరీష్ రావు అన్నారు.రైతులకు అన్యాయం చేస్తే రైతులు తిరగబడే రోజు వస్తుందని,ఆ విషయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలోనే గ్రహిస్తారని హరీష్ రావు ఘాటుగా వాఖ్యలు చేశారు.

## సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో భారీగా గంజాయి పట్టివేత



**హైదరాబాద్,జనవరి01(సూర్యరేఖ)** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో భారీగా గంజాయిని రైల్వే పోలీసులు పట్టుకున్నారు. గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..4858 కిలోల డ్రై గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు దాని విలువ రూ.1.2 లక్షలు అని రైల్వే పోలీసులు తెలిపారు.ఒడిశా రాష్ట్రం నుండి బెర్హాంపూర్ నుండి మహారాష్ట్రలోని దాదర్ కు పక్కా ప్లాన్ ప్రకారం తరలిస్తుండగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో రైల్వే పోలీసులు మెరుపు దాడి చేసి పట్టుకున్నారు.ఈ విషయమై పోలీస్ అధికారులు మాట్లాడుతూ..వివరాలు సేకరించి త్వరలోనే వారిని కోర్టులో హాజరు పరుస్తామని వారు తెలిపారు.

## మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన రాజేంద్రనగర్ సీనియర్ నాయకులు




**రాజేంద్రనగర్,జనవరి01**రాష్ట్ర మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని రాజేంద్రనగర్ సీనియర్ నాయకులు కొలను సుభాష్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఆమెను కలిశారు.ఈ సందర్భంగా ఆమెకు నూతన సంవత్సర శుభాకాంక్షలు వారు తెలిపారు.మాజీ మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.శుభాకాంక్షలు తెలిపిన వారిలో సీనియర్ నాయకులు డి.రమేష్ ముదిరాజ్,జాలిగం చిత్తారి,యువ నాయకులు మహేందర్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.అనంతరం మైలార్ దేవులపల్లి డివిజన్ యువ నాయకులు మన్నే శివకుమార్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయనకు మాజీమంత్రి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా శివ కుమార్ ను శాలువాతో సత్కరించి మిఠాయి తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.నిండు నూరేళ్లు శివ ప్రజా సమస్యలపై పోరాడుతూ సంతోషంగా ఉండాలని సబితా ఇంద్రారెడ్డి ఆకాంక్షించారు.

# ఉద్యోగ,ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

**ఉమ్మడి జిల్లాకో జోనల్ సిస్టమ్ ఏర్పాటు చేస్తే బాగుండేది**
**క్రమశిక్షణకు మారు పేరు డిటిఎఫ్ యూనియన్**
**డిటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి**

**జగిత్యాల :** జోనల్ విధానం, 317 జిఓ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు గొడ్డలిపెట్టులా ఉందని రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాకో జోనల్ పేరిట పది జోనళ్ళు ఏర్పాటు చేసి ఉంటే బాగుండేదని పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు.డెమోక్రటిక్ టీచర్స్ యూనియన్ రూపొందించిన 2025 నూతన సంవత్సరం క్యాలెండర్ ను బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్ లో టీచర్లతో కలిసి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిటిఎఫ్ క్రమశిక్షనకు మారు పేరు అని చెబుతూ పాఠశాలలు, ఉపాధ్యాయుల సమస్యల కోసం పోరాటం చేస్తున్నాధన్నారు.317 జీ ఓలో జోనల్ విధానం ఏర్పాటు సరిగా లేకపోవడంతో అది ఉద్యోగులకు గొడ్డలుపెట్టులా ఉందన్నారు. దీని పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందాన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని జీవన్ రెడ్డి పేర్కొన్నారు. నేను పట్టభద్రుల ఎమ్మెల్సీగా మీ ప్రతినిధి అని ఎమ్మెల్సీగా నా విజయంలో మీపాత్ర మరువలేనిదని పేర్కొన్నారు.శాసన మండలిలో టీచర్లు, ఉద్యోగుల సమస్యలు ,నిరుద్యోగులైన పట్టభద్రులకు ఉపాధిపై పలు మార్లు చర్చించ్చానని జీవన్ రెడ్డి చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 11 వేల టీచర్ల నియామాకం, బదిలీలు, పదోన్నాతులు చేపట్టిందని ఇక ఉద్యోగులకు పిఆర్సి, డీఏ లు పెండింగులో ఉన్నాయనని వివరించారు. ఖాళీల మేరకు ఉద్యోగాలు భర్తీ చేయడానికి సిఎం రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని, ఏడాదికి రెండు సార్లు టెట్ నిర్వహించడం ప్రభుత్వ బాధ్యతగా గుర్తించ్చిందని, దానిలో భాగంగానే నిన్న టెట్ పరీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. సమాజ నిర్మాణంలో విద్య ప్రధానమని అందుకే విద్య ప్రాథమిక హక్కుల్లో చేర్చాబడిందని, విద్యాభివృద్ధికి టీచర్లు కృషి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. 2004 తర్వాత ఉద్యోగం పొందినవరికి కాంట్రీభ్యుషన్ పెన్షన్ స్కీమ్ వర్తిస్తుందని, అంతకంటే ముందు ఉద్యోగులకు ఓల్డ్ పెన్షన్ స్కీమ్ వరుస్థిస్తుందాన్నారు. పాఠశాలల్లో స్కావేంజర్ల నియామకం రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో చేపట్టాగా జగిత్యాల జిల్లలో కలెక్టర్ నిధులు లేవని చేపట్టలేదని డిటిఎఫ్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు ఎన్నం రాంరెడ్డి, ఇతర టీచర్లు జీవన్ రెడ్డి దృష్టికి తేగా ప్రతి పాఠశాలలో ఒక స్కావేంజర్ ఉండేలా కలెక్టర్ తో మాట్లాడతానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. జగిత్యాలలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చి విద్య హబ్ గా చేశానని అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు రిస్క్ తీసుకుని అందరిని మెప్పించి స్థల సేకరణ చేసి సొంత భవనాలు నిర్మాణం చేశానని జీవన్ రెడ్డి తెలిపారు.




ఆనంతరం యూత్ కాంగ్రెస్ నాయకులు రూపొందించిన క్యాలెండర్ ను గాజుల రాజేందర్, ముకేశ్ ఖన్నా, రఘువిర్ గౌడ్, దుర్గయ్య, రేపల్లె హరికృష్ణ తదితర నాయకులతో కలిసి జీవన్ రెడ్డి ఆవిష్కరించారు. వాకార్స్ అసోసియేషన్ సభ్యులు గౌతమ్ రెడ్డి ,టివి సూర్యం, ప్రభాకర్ రావు, పాత్రికేయులు ఎన్నం కిషన్ రెడ్డి, పన్నాల లక్ష్మారెడ్డి ,రాజ్ కుమార్,మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు తాటిపర్తి విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి , అల్లాల సరిత రమేష్ రావు, నాగిరెడ్డి రజిత, చిట్ల లత, పెరుకపల్లె ప్రజలు, ప్రయివేట్ సర్వీస్ అసోసియేషన్ సభ్యులు, యూత్ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటిఎఫ్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర శిక్షా ఉద్యోగుల పోరాటానికి సంపూర్ణ మద్దతు

రిటైర్డ్ ఇంటర్మీడియెట్ ఆర్జేడీ ఎల్.సుహాసిని

**జగిత్యాల :** సమగ శిక్షా ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నానని, వారి సర్వీసులు క్రమ బద్దీకరించబడి, వారికి న్యాయం జరిగే వరకు వారి వెంట ఉంటానని రిటైర్డ్ ఇంటర్మీడియెట్ ఆర్జేడీ ఎల్.సుహాసిని స్పష్టం చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో 23 రోజులుగా సమగ్ర శిక్షా ఉద్యోగులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని బుధవారం రిటైర్డ్ ఆర్జేడీ సుహాసిని బ సందర్శించారు.వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సుహాసిని మాట్లాడుతూ, సమగ్ర శిక్షా ఉద్యోగులు 23 రోజులు చేస్తున్న పోరాటం సత్యాగ్రహం లాంటిదన్నారు. 18 ఏండ్ల నుండి సమగ్ర శిక్షా విభాగంలో దాదాపు ఇరవై వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారన్నారు. వారికి న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా రావాల్సిన హక్కులు, ప్రయోజనాలు రాకపోవడం బాధకరమన్నారు. నిరుపేద విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలలు,కస్తూర్బా పాఠశాలల్లో సమగ్ర శిక్షా ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తున్నా రన్నారు. చాలీచాలనీ వేతనంతో, అనేక వ్యయ ప్రయాసలు ఓర్చుకుంటూ, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పనిచేస్తున్నార న్నారు. ప్రసూతి సెలవుల వంటి కనీస సౌకర్యాలు లేకుండా మహిళా ఉపాధ్యాయులను పని చేయించుకోవడం అత్యంత బాధకరం అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోను, తదుపరి తెలంగాణ రాష్ట్రంలోను సమగ్ర శిక్షా ఉద్యోగులకు సరైన న్యాయం జరగలేదన్నారు. 18 ఏండ్ల పాటు ప్రభుత్వం సేవలు తీసుకొని సమగ్ర శిక్షా ఉద్యోగుల సేవలను గాలికి వదిలిపెట్టడం సరికాదన్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగులు గొంతెమ్మ కోరికలు కోరడం లేదని, వారు చెబుతున్న డిమాండ్లలో న్యాయం ఉందన్నారు. బేషరతుగా వారందరి సర్వీసులను క్రమబద్ధీకరించాల్సిందేనన్నారు. సర్వీసులు రెగ్యులరైజ్ చేసే వరకు పేస్కేల్ అమలు చేయాలని, జీవిత భీమా 20 లక్షలు, ఆరోగ్య భీమా 10 లక్షలు ఇవ్వమని కోరుతున్నారని, ఇవి అతి సాధారణ డిమాండ్లన్నారు. రైతులకు ఐదులక్షల బీమా ఇస్తున్న ప్రభుత్వం, టీచర్లకు, విద్యారంగ నిపుణులకు ఇరవై లక్షల బీమాను చెల్లించలేదా అని ఆమె ప్రశ్నించారు. ప్రైవేట్ కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులకు ఏడాదికి పది లక్షల ఆరోగ్య భీమా సౌకర్యం కల్పిస్తున్నారని, ప్రభుత్వ అధీనంలో పనిచేసే పాఠశాలల్లో పనిచేసే వారికి ఆమాత్రం బీమా సౌకర్యం



కల్పింపజేయలేరా అని ఆమె ప్రశ్నించారు.రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని, సమగ్ర శిక్షా ఉద్యోగులు మద్దతును ఇవ్వాలని, వారి సమస్యల పరిష్కారం అయ్యే వరకు అసెంబ్లీ వేదికగా పోరాటం జరుపుతానన్నారు. కాగా..23వ రోజు సమగ్ర శిక్ష.. ఉద్యోగులు...కారం మెతుకులు తిని తమ నిరసన తెలిపారు... ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు సంఘం నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

# బీసీ మహాసభ పోస్టర్ విడుదల చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

**కామారెడ్డి డిక్లరేషన్, స్థానిక సంస్థల్లో 42% బీసీ కులాలకు రిజర్వేషన్ల అమలుకై ఈ నెల 3న ఇందిరా పార్కు వద్ద భారీ సభ**
**మద్దతు ప్రకటించిన సర్పంచ్ ల సంఘం జేఏసీ, తెలంగాణ విద్యార్థి జేఏసీ**
**జిల్లాల నుంచి భారీ స్పందన**

**హైదరాబాద్ :** బీసీలకు కామారెడ్డి డిక్లరేషన్ పేరిట కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తడితేవ డానికి తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించనున్న బీసీ మహాసభ పోస్టర్ ను ఆ సంస్థ అధ్యక్షురాలు, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బుధవారం నాడు విడుదల చేశారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలుతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలన్న డిమాండ్ తో సావిత్రీ బాయి పూలే జయంతిని పురస్కరించుకొని ఈ నెల 3వ తేదీన ఇందిరా పార్కు వద్ద బీసీ మహాసభ పేరిట తెలంగాణ జాగృతి సంస్థ భారీ సభను తలపెట్టనుంది. ఈ బీసీ మహాసభకు తెలంగాణ రాష్ట్ర సర్పంచ్ ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ, తెలంగాణ విద్యార్థి జేఏసీతో పాటు మరిన్ని ప్రజా సంఘాలు, కుల సంఘాలు మద్దతు ప్రకటించాయి. బీసీల కోసం పోరాటం చేస్తున్న ఎమ్మెల్సీ కవితకు తాము వెన్నుదన్నుగా నిలుస్తామని ఆ సర్పంచ్ ల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ ప్రకటన చేశారు. తాము పెద్ద సంఖ్యలో మహాసభకు హాజరవుతాయని, తమ హక్కులను సాధిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు తీరని అన్యాయం చేస్తున్నదని మండిపడ్డారు. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ల పెంపుపై ప్రభుత్వం కాలయాపన చేసే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా కూడా బీసీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని సీఎం రేవంత్ రెడ్డి అమలు చేయలేదని చెప్పారు. కాబట్టి కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయడం, రిజర్వేషన్ల పెంపు ప్రధాన డిమాండ్లుగా తాము మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బీసీ మహాసభలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ కవిత పిలుపునిచ్చారు.

ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ముందు బీసీ మహాసభ పోస్టర్లను తెలంగాణ విద్యార్థి జేఏసీ ప్రదర్శించింది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ... కామారెడ్డి డిక్లరేషన్, స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ల పెంపునకు ఎమ్మెల్సీ కవిత చేస్తున్న కృషికి తాము మద్దతు ప్రకటిస్తున్నామని, విద్యార్థి లోకమంతా ఎమ్మెల్సీ కవిత చేపడుతున్న కార్యక్రమల్లో పాల్గొంటామని ప్రకటించారు. కవిత గారి నివాసంలో జరిగిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు బొల్లా శివశంకర్, పెంట రాజేష్, సుంకోజు కృష్ణమాచారి, ఆలకుంట్ల హరి, కుమారస్వామి, విజేందర్ సాగర్, రాచమల్ల బాలకృష్ణ, కోళ్ల శ్రీనివాస్, సాల్వా చారి, మురళి, నిమ్మల వీరన్న, లింగం, అశోక్ తదితరులు పాల్గొన్నారు

## సైబర్ నేరగాళ్ల చేతిలో

## మోసపోయి బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

**కరీంనగర్ :** బంగారు భవిష్యత్ ఉన్న యువకుడు సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయి తనువు చాలించాడు. తల్లిదండ్రులకు తెలిస్తే..ఏమంటారనే భయంతో ఈ అఘాత్యాయానికి పాల్పడ్డాడు. ఎదిగిన కొడుకు.. కళ్ల ముందే చనిపోవడంతో పేరెంట్స్ తట్టుకోలేక కన్నీరు, మున్నీరుగా విలపిస్తున్నారు.కరీంనగర్ జిల్లా వీణవంక మండలం బేతిగల్ గ్రామానికి చెందిన గుమ్మడి సృజన్ ఉమా దంపతుల పెద్ద కుమారుడు రిషి వర్ధన్ డిప్లమా పూర్తి చేశాడు. పై చదువుల కోసం ప్రిపేర్ అవుతున్నారు. చదువులో మంచి ప్రతిభను చూపేవాడు వర్ధన్. ఇటీవల రిషి వర్ధన్ కు టెలిగ్రామ్ లో వచ్చిన మెసేజ్ ను ఓపెన్ చేశాడు. మా కంపెనీలో పెట్టుబడి పెడితే లాభాలు డబుల్ వస్తాయని ఆశ చూపారు. మొదటగా 5000, 6000, 25000, 65000 వరకు పెట్టాడు. తరువాత 1,50,000 ప్రాఫిట్ చూపించారు. మరిన్ని డబ్బులు పెడితే.. ఇంకా డబ్బులు వస్తాయని మాయ మాటలు చెప్పారు. ఇది నమ్మి మరింత పెట్టుబడి పెట్టాడు.మోసగాళ్లు 2 లక్షల 50 వేలు కడితే మీ డబ్బులు రిఫండ్ చేసుకోవచ్చని చెప్పారు. అయితే కొద్ది నిమిషాల్లో అకౌంట్లో అప్పటికే డబ్బులు పూర్తిగా అయిపోయాయి. ప్రాఫిట్ డబ్బులు విత్ డ్రా చేసుకోవడానికి ఆప్షన్ ఇవ్వలేదు. చాలా సార్లు ప్రయత్నం చేశాడు. ఎలాంటి సమాధానం రాలేదు. దీంతో మోసపోయానని గుర్తించారు. ట్రాన్స్ఫర్ చేసిన డబ్బులు మొత్తం లాగేసుకున్నారు. అయన అకౌంట్ నిల్ గా మారిపోయింది. రిషి వర్ధన్ తల్లిదండ్రులకు ఏం సమాధానం చెప్పాలో అర్థం కాక మానసికంగా ఇబ్బంది పడ్డారు. డబ్బుల పోయిన విషయం ఇంట్లో తెలిస్తే ఏం అవుతుందోనన్న భయంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు.ఆత్మహత్యకు ముందు రిషి వర్ధన్ ఓ సుసైడ్ నోట్ రాశాడు. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్కూల్ నుంచి వచ్చిన తమ్ముడు కిటికీలో నుంచి చూసి అన్న ఉరివేసుకున్నాడని కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి తలుపులు పగలగొట్టి హాస్పటల్ కు తరలించే లోపే మృతి అతడు మృతిచెందాడు.

## జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు

**జిల్లా ఎస్పీ రావుల గిరిధర్**



**వనపర్తి :** శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు (జనవరి 1వ తేది నుండి 31 వరకు) 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపిఎస్ ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేనిది వనపర్తి జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రజా ధనానికి నష్టం కల్గించే, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదన్నారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఇట్టి విషయంలో పోలీసు వారికి సహకరించవలసిందిగా సూచించారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## ఆటో బోల్తా..పదిమంది మహిళలకు గాయాలు

**రాజన్నసిరిసిల్ల :** బోయినిపల్లి మండలం కొదురుపాక ఎక్స్ రోడ్డు వద్ద టాటా ఏస్ ఆటో.. అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో పది మంది మహిళలకు గాయాలు అయ్యాయి. ఇద్దరు పరిస్థితి విషమంగా వుంది. వారందరిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ట్రాలీ ఆటోలో 20 మంది మహిళలు వేములవాడ రాజన్న దర్శనం కోసం వెళ్తుండగా ప్రమాదం జరిగింది. వారంతా మహారాష్ట్ర కు చెందిన వలస కూలీలుగా గుర్తించారు. కరీంనగర్ లోని అల్గునూర్ లో ఉంటు వరి నాట్లు వేసే కూలీలు.

## బస్సు, లారీ ఢీ?.ఎనిమిది మందికి గాయాలు

**సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ బైపాస్ రోడ్డులో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జహీరాబాద్ డిపోకు చెందిన ఎక్స్ ప్రెస్ బస్సు అల్గోల్ చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా వెనుక వైపు నుండి లారీ ఢీకొట్టింది. ముంబయి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ బస్సును వేగంగా ఢీకొట్టడంతో 8 మంది ప్రయాణికులు గాయపడ్డారు. క్షతగాత్రులను జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. 65 నెంబర్ జాతీయ రహదారిపై ప్రమాదంతో ఇరువైపులా వాహన రాకపోకలు నిలిచిపోయాయి. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి బస్సు లారీని పక్కకు తప్పించి రాకపోకలు పునరుద్ధరించారు. ఫ్లై ఓవర్ నిర్మించకపోవడంతో అల్గొల్ చౌరస్తాలో తరచు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## దివ్యాంగులకు రాజ్యాధికారం వాటా దక్కాల్సిందే..

**ఆదిలీల ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి శ్రీ వాణి చందేల్**



**హైదరాబాద్ :** రాజ్యాధికారానికి దివ్యాంగులు అర్హులే నని రాజ్యాధికారం లో దివ్యాంగులు పాలుపంచుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని సామాజిక వేత్త ఆదిలీల ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి శ్రీ వాణి చందేల్ అన్నారు. వరల్డ్ డిసబుల్ డే పురస్కరించుకొని దివ్యాంగులకు రాజ్యాధికారం అనే నినాదాంతో ఐపిసి దివ్యాంగుల విభాగం ఆధ్వర్యంలో అబిడ్స్ లోని సూర్యలోక్ కాంప్లెక్స్ పీపుల్స్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ లో జరిగిన కార్యక్రమానికి ప్రత్యేక అతిధిగా పాల్గొని ప్రసంగించారు. దివ్యాంగులు అనగానే సమాజం లో చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. వారుకూడా దీవుడు సృష్టించిన బిద్దలేనని, సమాజంలో మనతో కలిసి మెలిసి ఉంటున్న వారికి గౌరవం ఇవ్వవలసిన బాద్యత తోటివారిగ బాద్యత అన్నారు.వారిలీ అండ వైకల్యం ఉండవచ్చు గాని తెలివితేటల్లో అందరికన్నా ఒకడుగు ముందే ఉంటారన్నారు. దివ్యాంగులు దివ్యాంగులమని బాదప్ళిఆడకుండా ఆత్మస్త్యర్యం తో అందరితో సమానంగా ముందుకు రావాలని పిలుపళిఉనిచ్చారు. అలాంటప్పుడే దివ్యాంగులు అభివృద్ధి పాఠం లో ముందుకు వేల్లగాలరన్నారు. ఈ సందర్బంగా ఐపిసి దివ్యాంగుల విభాగం జాతీయ అధ్యక్షురాలు శివలెంక ఉదయలక్ష్మి,జాతీయ అద్యక్షులు శ్రీదర్, చిత్ర , అల్లాజీ,నవీన తదితరులు శ్రీ వాణి చందేల్ ను ఘనంగా సన్మానించారు.

## గురుకుల విద్యాలయాల్లో మృత్యుఘోష

**ఖమ్మం :** తెలంగాణ రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో మరణమృదంగం మోగుతోంది. ఇప్పటికే పలువురు విద్యార్థులు పాముకాట్లు, కలుషిత ఆహారం వల్ల బలైతే.. తాజాగా మరో ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకుని తనువు చాలించారు. ఒకరు కళాశాలలోనే ఉరి వేసుకోగా, మరోచోట ఎలుకల మందుతాగి ప్రాణాలు విడిచాడు. ఖమ్మం జిల్లాలో వేరువేరు గరుకులాల్లో ఈ దారుణ సంఘటనలు చోటు చేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఖమ్మం జిల్లా ముదిగొండకు చెందిన మాడుగుల సాయివర్ధన్ (17) మధిర మండలం కృష్ణాపురం సోషల్ వెల్ఫేర్ బాలుర జూనియర్ కళాశాలలో ఎంపీసీ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. క్రిస్మస్ సెలవులకు ఇంటికి వెళ్లిన సాయివర్ధన్.. సోమవారం మధ్యాహ్నం హాస్టల్కు వచ్చాడు. తోటి విద్యార్థులతో రాత్రి 10 గంటల వరకు కలిసే ఉన్నాడు. అర్ధరాత్రి సమయంలో అందరూ నిద్రపోయిన తర్వాత హాస్టల్ పైఅంతస్తులోకి వెళ్లి చున్నీతో ఫ్యాన్కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం తెల్లవారుజామున హాస్టల్ సిబ్బంది గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం చింతగుర్తికి చెందిన కుక్కల భార్గవ్ (17) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ ఎస్సీ గురుకుల కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. క్రిస్మస్ సెలవుల నిమిత్తం ఇంటికి వచ్చిన భార్గవ్ను తిరిగి హాస్టల్కు వెళ్లాలని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన భార్గవ్ డిసెంబర్ 27న ఇంట్లో ఉన్న ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

బిజినెస్

# పెరిగిన బంగారం రుణ ఎన్‌పిఎలు

దేశ ఆర్థిక వ్యవస్థ మందగించడం, ఆదాయాలు తగ్గడం, అప్పులు పెరగడంతో బంగారం రుణాల్లో భారీగా మొండి బాకీలు పెరుగుతున్నాయి. మరోవైపు తాకట్టు పెట్టిన బంగారం వేలానికి వస్తోంది. గతేడాది 2024 ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో బ్యాంకులు, బ్యాంకింగేతర విత్త సంస్థ (ఎన్‌బిఎఫ్‌సి)ల పసిడి రుణాల నిరర్థక ఆస్తులు 30 శాతం ఎగిసి రూ.6,696 కోట్లకు చేరాయి. ఇంతక్రితం మార్చి ముగింపు నాటికి రూ.5,149 కోట్ల నిరర్థక ఆస్తులు చోటు చేసుకున్నాయి. ఆర్‌బిఐ గణంకాల ప్రకారం.. 2022-23లో బంగారం రుణాల జారీలో 14.6 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు సమాచార హక్కు చట్టం కింద ఆర్‌బిఐ ఇచ్చిన వివరాల మేరకు.. 2024 జూన్ ముగింపు నాటికి వాణిజ్య బ్యాంక్‌ల బంగారం రుణాల ఎన్‌పిఎలు రూ.2,445 కోట్లకు చేరాయి. 2024 మార్చి నాటికి రూ.1,513 కోట్ల ఎన్‌పిఎలు నమోదయ్యాయి. ఇదే సమయంలో ఎన్‌బిఎఫ్‌సిల పసిడి రుణ ఎన్‌పిఎలు 3,636 కోట్లుగా ఉండగా.. జూన్ ముగింపు నాటికి రూ.2,445 కోట్లకు చేరాయి. బంగారం రుణాలు తిరిగి చెల్లించడంలో రుణగ్రహీతలు విఫలం కావడమే ఇందుకు ప్రధాన కారణం. ఆర్థిక వ్యవస్థ మందగించడం ఆదాయ స్థాయిలను ప్రభావితం చేయడంతో ఖాతాదారులు తిరిగి చెల్లించడం కష్టతరంగా మారడంతో బంగారం రుణాల డిఫాల్ట్‌లు పెరుగుతున్నాయని ఆ పరిశ్రమ వర్గాల అంచనా. బంగారం ధరలు పెరగడంతోనూ ప్రజలు ఇంటి ఖర్చులు, పాఠశాల, విద్య ఫీజులు, వైద్య అవసరాల కోసం తమ బంగారాన్ని తాకట్టు పెట్టారు. అక్టోబర్ 2024 నాటికి బ్యాంకుల్లో బంగారం రుణాలు రూ.1,54,282 కోట్లకు పెరిగాయి. మార్చి 2024 నాటికి రూ.1,02,562 కోట్లుగా నమోదయ్యాయి.



బ్యాంకులు, ఎన్‌బిఎఫ్‌సిల బంగారు రుణ పుస్తకం కలిపి రూ.3 లక్షల కోట్ల మార్కును దాటినట్లు అంచనా. గడిచిన ఏడాది 2024లో బంగారం ధరలు 23 శాతం పెరిగాయి. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికయ్యాక జాతీయంగా, అంతర్జాతీయంగా బంగారం ధరలు కొంత దిగి వచ్చాయి. 2025లో తులం బంగారం ధర రూ.90 వేలకు చేరుతుందని బులియన్ మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. భౌగోళిక ఉద్రిక్తతలు, ప్రపంచ ఆర్థిక రంగంలో ఒడిదొడుకులు ఇలాగే కొనసాగడంతోపాటు అమెరికా డాలర్‌పై రూపాయి మారకం విలువ పతనం వంటి కారణాలతో 2025లో దేశీయ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత గల 10 గ్రాముల బంగారం ధర రూ.85 వేల నుంచి రూ.90 వేల వరకూ చేరొచ్చని అంచనా. ప్రస్తుతం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో పది గ్రాముల బంగారం ధర రూ.79,350గా ఉంది. 2024 జనవరి ఒకటో తేదీన తులం బంగారం ధర రూ.63,870 పలికింది. నాటి నుంచి ఇప్పటి వరకూ బంగారం ధర 23 శాతం పెరిగింది. అక్టోబర్ 30న తులం బంగారం ధర రూ.82,400కి చేరి జీవిత కాల గరిష్టాన్ని తాకింది.

## రిలయన్స్ కెజి చమురుకు ప్రీమియం ధర



రిలయన్స్ ఇండిస్టీస్ కెజి బేసిన్‌లో ఉత్పత్తి చేసే ముడి చమురుకు ప్రీమియం ధరను డిమాండ్ చేస్తోంది. ఇందుకోసం బిడ్లను అహ్వానిస్తోంది. దీంతో బిడ్డర్లు అంతర్జాతీయ బెంచ్‌మార్క్ కన్నా కనీసం 3.5 డాలర్లు అధికంగా కోట్ చేయాల్సి ఉంటుంది. 2025 జనవరి 24 నాటికి బిడ్లను దాఖలు చేయాల్సి ఉంటుంది. 2025 ఏప్రిల్ నుంచి 2026 ఫిబ్రవరి వరకు ప్రతి నెలా ఉత్పత్తి చేసే 17,600 బ్యారెళ్ల ఆయిల్ విక్రయం కోసం తాజాగా బిడ్లను ఆహ్వానించింది. ప్రస్తుతం క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 73.5 డాలర్లుగా ఉంది. టెండరు ప్రకటన ప్రకారం దీనికి 1.5 డాలర్ల ప్రీమియంతో పాటు బ్యారెల్‌కు కనీసం 2 డాలర్లు అధికంగా బిడ్డర్లు కోట్ చేయాల్సి ఉంటుంది. తూర్పు గోదావరి జిల్లాలోని గాడిమొగ నుంచి ఈ ఆయిల్‌ను రిలయన్స్ సరఫరా చేస్తుంది. కెజి బేసిన్‌లో రిలయన్స్‌కు 66.67 శాతం, బ్రిటిష్ పెట్రోలియంకు 33.33 శాతం చొప్పున వాటాలున్నాయి.

## గతేడాది మార్కెట్‌లో 8 శాతం రాబడులు



**ముంబయి :** గతేడాది 2024లో భారత స్టాక్ మార్కెట్లు 8 శాతంగా పైగా రాబడులను అందించాయి. సెన్సెక్స్ 5,898.75 పాయింట్లు లేదా 8.16 శాతం పెరిగింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 1,913 పాయింట్లు లేదా 8.80 శాతం లాభపడింది. సెప్టెంబర్ 27న సెన్సెక్స్ రికార్డ్ స్థాయిలో 85,978 మార్క్‌ను తాకాగా.. నిఫ్టీ 26,277 గరిష్ట స్థాయిని నమోదు చేసింది. ఏడాది చివరి రోజు మంగళవారం స్వల్ప నష్టాలను చవి చూశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో ఐటితోపాటు కొన్ని బ్యాంకింగ్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి నెలకొంది. దీంతో బిఎస్‌ఇ సెన్సెక్స్ 109.12 పాయింట్ల నష్టంతో 78,139కు పరిమితమయ్యింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 0.10 పాయింట్లు తగ్గి 23,644.80 వద్ద ముగిసింది. ఇంతక్రితం సోమవారం సెషన్‌లో సెన్సెక్స్ 450 పాయింట్లు, నిఫ్టీ 168 పాయింట్ల చొప్పున పతనమయ్యాయి. అదానీ విల్మార్ నుంచి అదానీ గ్రూప్ వైదొలుగుతున్నట్లు ప్రకటించడంతో మంగళవారం ఇంట్రాడేలో అదానీ విల్మార్ షేర్లు దాదాపు ఎనిమిది శాతం పతనమైంది. బిఎస్‌ఇలో తుదకు 6.45 శాతం నష్టంతో రూ.308.25 వద్ద ముగిసింది. ఈ ఎఫ్‌ఎంసిజి జాయింట్ వెంచర్ అదానీ విల్మార్ నుంచి వైదొలుగుతున్నట్లు సోమవారం అదానీ ఎంటర్‌ప్రైజెస్ ప్రకటించిన విషయం తెలిసిందే.

# ఆన్‌లైన్ మనీ ట్రాన్స్‌ఫర్.. ఏప్రిల్ 1, 2025 నుంచి కొత్త నిబంధనలు..

ఆన్‌లైన్ మనీ ట్రాన్స్‌ఫర్‌ను మరింత పటిష్టం చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సరికొత్త నిబంధనలను అమల్లోకి తీసుకురాబోతోంది. ఏప్రిల్ 1, 2025 నాటికి నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్ ట్రాన్స్‌ఫర్, ఆన్‌లైన్ మనీ ట్రాన్ఫం ను మరింత పటిష్టం చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సరికొత్త నిబంధనలను అమల్లోకి తీసుకురాబోతోంది. ఏప్రిల్ 1, 2025 నాటికి నేషనల్ ఎలక్ట్రానిక్ ఫండ్ ట్రాన్స్‌ఫర్ రియల్ టైమ్ గ్రాస్ సెటిల్‌మెంట్ సిస్టమ్‌ను ఉపయోగించే అన్ని బ్యాంకులు ఈ కొత్త నిబంధనలను ఫాలో కావాల్సి ఉంటుంది. నిధుల బదిలీలో పొరపాట్లను నివారించడానికి, మోసాలను అరికట్టడం కోసం లబ్ధిదారుల ఖాతా పేరును ధ్రువీకరించే సదుపాయాన్ని తీసుకురాబోతున్నట్టు ఆర్బీఐ ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ కొత్త సదుపాయం ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసే వ్యక్తి లబ్ధిదారుల పేరును తెలుసుకునే వీలు కలుగుతుంది. చెల్లింపుదారు నమోదు చేసిన ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఆధారంగా, లబ్ధిదారుని బ్యాంక్ సీబీఎస్ నుంచి ఖాతాదారుడి పేరు బదిలీ చేసే వ్యక్తికి ఈ పేరు కనిపిస్తుంది. ఆ పేరు సరైనదేనని ధ్రువీకరించుకున్న తర్వాత చెల్లింపుదారుడు ట్రాన్సాక్షన్‌ను పూర్తి చేయవచ్చు. ఒకవేళ లబ్ధిదారుడి పేరు కనిపించకపోతే, ఆ ట్రాన్సాక్షన్ చేయాలా? వద్దా? అనేది చెల్లింపుదారుడి ఇష్టం. ఎలాంటి ఛార్జీలు లేకుండానే కస్టమర్లకు ఈ సేవను అందిస్తామని ఆర్బీఐ స్పష్టం చేసింది. కస్టమర్ల గోప్యతను దృష్టిలో ఉంచుకుని, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఈ సదుపాయానికి సంబంధించిన ఎలాంటి డేటాను నిల్వ చేయదు. డిజిటల్ చెల్లింపు వ్యవస్థను మరింత సురక్షితమైన, వినియోగదారు-స్నేహపూర్వకంగా మార్చడానికి ఆర్బీఐ ఈ ముఖ్యమైన చొరవ తీసుకుంటోంది. ఇది ఫండ్ ట్రాన్స్‌ఫర్‌లో తప్పులను తగ్గించడమే కాకుండా, కస్టమర్ విశ్వాసాన్ని కూడా పెంచుతుంది. ఒకవేళ ట్రాన్సాక్షన్



సంబంధిత వివాదాలు తలెత్తినప్పుడు, చెల్లింపుదారు బ్యాంక్, లబ్ధిదారుడి బ్యాంక్ వివాదాన్ని ప్రత్యేక లుకప్ రిఫరెన్స్ నంబర్, సంబంధిత లాగ్‌లను ఉపయోగించి పరిష్కరిస్తారని కూడా ఆర్బీఐ తెలిపింది.

# రోహిత్- గంభీర్‌తో బీసీసీఐ సమావేశం

స్పోర్ట్స్

ఈ సిరీస్ తర్వాత కెప్టెన్ రోహిత్ శర్మ, కోచ్ గౌతం గంభీర్‌తో చర్చలు ఉండవచ్చు. చీఫ్ సెలక్టర్ ఆస్ట్రేలియాలో ఉండి గంభీర్, రోహిత్‌లతో మాట్లాడినప్పటికీ అతను సిరీస్ మధ్యలో ఎటువంటి నిర్ణయానికి రాలేదని నివేదిక స్పష్టం చేసింది. భారత్-ఆస్ట్రేలియా మధ్య బోర్డర్-గవాస్కర్ సిరీస్ ఉత్కంఠగా కొనసాగుతోంది. నాలుగు మ్యాచ్‌ల తర్వాత టీమిండియా 1-2తో సిరీస్‌లో వెనుకంజలో ఉంది. ఈ మొత్తం సిరీస్‌లో సీనియర్ బ్యాట్స్‌మెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలు భారీ స్కోరు సాధిస్తారని అంచనా వేసినా అది జరగలేదు. జట్టు ఇప్పుడు పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆస్ట్రేలియాతో బోర్డర్-గవాస్కర్ సిరీస్‌ను కోల్పోవాల్సి వస్తోందని క్రీడా పండితులు అంచనా వేస్తున్నారు. దీంతో రోహిత్, కోహ్లీపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విరాట్-రోహిత్ మాత్రమే కాదు.. ప్రధాన కోచ్ గౌతం గంభీర్ పాత్రపై కూడా ప్రశ్నల వర్షం కురుస్తోంది. అయితే సిడ్నీ ఐదో టెస్టుకు ముందు టీమిండియా కెప్టెన్ రోహిత్, గంభీర్‌లతో బీసీసీఐ సమావేశం నిర్వహించవచ్చని తెలుస్తోంది. భారత జట్టు చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ ఆస్ట్రేలియా చేరుకున్నట్లు కూడా చెబుతున్నారు. కెప్టెన్సీ, రిటైర్‌మెంట్‌కు సంబంధించి రోహిత్-అగార్కర్‌కు మధ్య చర్చలు జరిగాయని ప్రచారం జరుగుతోంది. రోహిత్ శర్మ బోర్డర్ గవాస్కర్ ట్రోఫీకి ముందు న్యూజిలాండ్‌పై 6 ఇన్నింగ్స్‌లలో 91 పరుగులు మాత్రమే చేశాడు. బంగ్లాదేశ్ సిరీస్‌లో 42 పరుగులు సాధించాడు. గత 15 ఇన్నింగ్స్‌లలో అతని టెస్ట్ పరుగుల సంఖ్య 164 మాత్రమే. ఇందులో రోహిత్ సగటు 11 కంటే తక్కువ. తాజాగా క్రిక్‌బజ్ నివేదిక ప్రకారం.. ఈ సిరీస్ తర్వాత కెప్టెన్



రోహిత్ శర్మ, కోచ్ గౌతం గంభీర్‌తో చర్చలు ఉండవచ్చు. చీఫ్ సెలక్టర్ ఆస్ట్రేలియాలో ఉండి గంభీర్, రోహిత్‌లతో మాట్లాడినప్పటికీ అతను సిరీస్ మధ్యలో ఎటువంటి నిర్ణయానికి రాలేదని నివేదిక స్పష్టం చేసింది. రోహిత్ కావాలంటే సిడ్నీ టెస్టు మ్యాచ్‌కు దూరంగా ఉండొచ్చు. అయితే దీని పరిధి తక్కువ. జనవరి 3 నుంచి ప్రారంభం కానున్న చివరి టెస్టు మ్యాచ్‌లో అతను జట్టుకు నాయకత్వం వహించబోతున్నాడు. తాను ఇంకా రిటైర్మెంట్ తీసుకోలేదని నాలుగో టెస్టు మ్యాచ్ అనంతరం విలేకరుల సమావేశంలో చెప్పాడు. కాగా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ పాత్రపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆయన ప్రస్థానం ప్రారంభం నుంచి భారత్‌కు ఓటమిపై ఓటమి ఎదురవుతోంది. శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్ అయినా లేదా స్వదేశంలో న్యూజిలాండ్‌పై క్లీన్‌స్వీప్ అయినా ఇప్పుడు దీ+ులో 2-1తో వెనుకబడి ఉన్నా ఈ జోడీ మంచిగా పని చేయడం లేదని నిరూపిస్తోంది.

## అగార్కర్- గంభీర్ మధ్య రిలేషన్ సరిగ్గా లేదా?



ఛతేశ్వర్ పుజారా టీమిండియా తరఫున 100 టెస్టు మ్యాచ్‌లు ఆడాడు. అతను చివరిసారిగా 2023 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో టీమ్ ఇండియా తరపున ఆడాడు. పుజారా ఎల్లప్పుడూ ఆస్ట్రేలియా పర్యటనలో మంచి ప్రదర్శన ఇచ్చాడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ 2024-25 భారతదేశం, ఆస్ట్రేలియా మధ్య జరుగుతుంది. ఇందులో చివరి అంటే 5వ మ్యాచ్ జనవరి 3 నుండి సిడ్నీలో జరుగుతుంది. అయితే అంతకుముందే ఓ వార్త బయటకు వచ్చింది. నిజానికి టీమ్ ఇండియా హెడ్ కోచ్ గౌతం గంభీర్, బీసీసీఐ సెలక్టర్ అగార్కర్ మధ్య సంబంధాలు సరిగా లేవని కథనాలు వస్తున్నాయి. పుజారాకు సంబంధించిన విషయంలో ఈ ఇద్దరి మధ్య వివాదం కూడా వచ్చినట్లు సమాచారం. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదిక ప్రకారం.. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ 2024-25 కోసం టీమ్ ఇండియాలో ఛతేశ్వర్ పుజారాను చేర్చుకోవాలని ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ కోరాడు. కానీ బీసీసీఐ సెలక్టర్లు గంభీర్ మాట వినలేదు. పుజారాను జట్టులో భాగం చేయలేదు. పెర్త్ టెస్టు తర్వాత పుజారాను టీమ్ ఇండియాలో చేర్చుకోవడంపై గంభీర్ మాట్లాడినట్లు నివేదికలో పేర్కొన్నారు. ఛతేశ్వర్ పుజారా గైర్హాజరీలో పుజారాను జట్టులోకి తీసుకోనందుకు ఆస్ట్రేలియా బౌలర్ జోష్ హేజిల్‌వుడ్ సంతోషం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. పుజారా ఇక్కడ లేకపోవడం చాలా సంతోషంగా ఉందని చెప్పాడు. జట్టు కష్ట సమయంలో ఉన్నప్పుడు పుజారా ఎన్నో స్లారు నిలకడగా రాణించాడు. అంతేకాకుండా అతను గత ఆస్ట్రేలియా టూర్‌లో చాలా మంచి ప్రదర్శన చేశాడు. ఛతేశ్వర్ పుజారా టీమిండియా తరపున 100 టెస్టు మ్యాచ్‌లు ఆడాడు. అతను చివరిసారిగా 2023 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో టీమ్ ఇండియా తరపున ఆడాడు. పుజారా ఎల్లప్పుడూ ఆస్ట్రేలియా పర్యటనలో మంచి ప్రదర్శన ఇచ్చాడు. పుజారా 2018-19 సంవత్సరం బోర్డర్- గవాస్కర్ ట్రోఫీలో 1258 బంతులు ఆడి 521 పరుగులు చేశాడు. 2020-21లో అత్యధిక పరుగులు చేసిన రెండో భారతీయ బ్యాట్స్‌మెన్‌గా నిలిచాడు. ప్రస్తుతం జరుగుతున్న బోర్డర్- గవాస్కర్ సిరీస్‌లో ఆస్ట్రేలియా ముందంజలో ఉంది. సిరీస్‌లోని నాల్గవ టెస్ట్ మ్యాచ్ మెల్‌బోర్న్‌లో ఆసీస్ జట్టు 184 పరుగుల తేడాతో టీమిండియాపై విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో విజయం సాధించడం ద్వారా ఆస్ట్రేలియా సిరీస్‌లో 2-1 ఆధిక్యంలో నిలిచింది. అంతేకాకుండా వరల్డ్ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్‌కు రెండో పోటీదారుగా నిలిచింది. జనవరి 3 నుంచి జరిగి సిడ్నీ టెస్టులో టీమిండియా గెలవకుంటే సిరీస్ ఆసీస్ కైవసం అవుతుంది.

# భరత్, హెబ్బార్ సెంచరీలు

విజయ్ హజారే వన్డే టోర్నమెంట్ లో ఆంధ్ర జట్టు హవా కొనసాగుతోంది. మంగళవారం జరిగిన గ్రూప్-బి లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు 10 వికెట్ల తేడాతో మేఘాలయాపై ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన మేఘాలయా 48.2ఓవర్లలో 223పరుగులకు ఆలౌటైంది. చక్రవర్తి(101) సెంచరీకి తోడు అర్పిత్(66) అర్ధసెంచరీతో రాణించగా.. ఆంధ్ర బౌలర్లు సందీప్(5/26), మహీప్, ఆంజనేయులు రెండేసి వికెట్లతో సత్తా చాటారు. ఆ లక్ష్యాన్ని ఆంధ్ర జట్టు వికెట్ కోల్పోకుండా ఛేదించింది. ఓపెనర్లు హెబ్బార్(109), శ్రీకర్ భరత్(107) సెంచరీలతో రాణించి మ్యాచ్‌ను ముగించారు. ఈ గెలుపుతో గ్రూప్-బిలో ఐదు మ్యాచ్‌లు ముగిసేసరికి ఆంధ్ర జట్టు 16పాయింట్లతో 2వ స్థానంలో ఉంది. అహ్మదాబాద్ వేదికగా జరిగిన మరో లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు కర్ణాటకపై భారీ లక్ష్యాన్ని ఛేదించింది. గ్రూప్-సిలో భాగంగా రైల్వే గ్రౌండ్‌లో మంగళవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో కర్ణాటక నిర్దేశించిన 321పరుగుల లక్ష్యాన్ని హైదరాబాద్ జట్టు మరో రెండు బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. తొలుత కర్ణాటక జట్టు నిర్ణీత 50 ఓవర్లలో



8వికెట్ల నష్టానికి 320పరుగులు చేసింది. మయాంక్ అగర్వాల్(124) వరుసగా మూడో శతకంతో మెరిసాడు. రవి చరణ్(80) అర్ధసెంచరీతో రాణించాడు. ఇక హైదరాబాద్ జట్టులో వరుణ్ గౌడ్(109నాటౌట్), తిలక్ వర్మ(99) బ్యాటింగ్‌లో రాణించి మ్యాచ్‌ను ముగించాడు. ఈ గెలుపుతో గ్రూప్-సిలో హైదరాబాద్ జట్టు 5 మ్యాచ్‌లు ముగిసేసరికి 12పాయింట్లతో 6వ స్థానంలో ఉంది.








## పవన్ ఫ్యాన్స్‌కు న్యూ ఇయర్ గిఫ్ట్..

# 'హరిహర వీరమల్లు' నుంచి ఫస్ట్ సింగిల్ 'మాట వినాలి'

ఏపీ డిప్యూటీ సీఎం, నటుడు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ హరిహర వీరమల్లు పిరియడికల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుపుకుంటుంది. ఈ సినిమాను 2025 మార్చి 28న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు మేకర్స్. ఇందులో భాగంగానే నూతన సంవత్సరం కానుకగా హరిహర వీరమల్లు నుండి ఫస్ట్ సింగిల్ అప్‌డేట్‌ను వెల్లడించారు. ఈ మూవీలో పవన్ కళ్యాణ్ పాడిన ఫస్ట్ సింగిల్ 'మాట వినాలి' అనే పాటను జనవరి 06న ఉదయం 9 గంటల 6 నిమిషాలకి విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. రూల్స్ రంజన్ దర్శకుడు జ్యోతి కృష్ణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. రెండు భాగాలుగా వస్తున్న ఈ చిత్రం మొదటి పార్ట్ 'హరిహర వీరమల్లు పార్ట్: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో ప్రేక్షకుల రాబోతున్నది. ఈ చిత్రంలో నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్, నర్గీస్ ఫక్రీ, బాబీ డియోల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి ఈ చిత్రానికి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.



# రామ్ చరణ్ 'గేమ్ ఛేంజర్' ట్రైలర్ టైం ఫిక్స్

రామ్ చరణ్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సమయంరానే వచ్చేసింది. 'గేమ్ ఛేంజర్ ట్రైలర్ ఎప్పుడు వస్తుందా అని వెయిట్ చేస్తున్న మెగా ఫ్యాన్స్‌కు మేకర్స్ క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈ మూవీ ట్రైలర్‌ను న్యూ ఇయర్ కానుకగా జనవరి 02 సాయంత్రం 5.04 గంటలకు విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా న్యూ ఇయర్ విషెస్ తెలుపుతూ కొత్త పోస్టర్‌ను పంచుకుంది. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తేజ్, దిగ్గజ దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న తాజా చిత్రం గేమ్ ఛేంజర్. ఈ సినిమాను అగ్ర నిర్మాత దిల్ రాజు నిర్మిస్తుండగా.. థమన్ సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. భారీ బడ్జెట్‌తో రాబోతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ కథానాయికగా నటిస్తుండగా.. సునీల్, ఎస్ జే సూర్య కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే మూవీ నుంచి టీజర్‌తో పాటు పాటలను విడుదల చేయగా.. సూపర్ రెస్పాన్స్‌తో దూసుకుపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే ట్రైలర్ కోసం వెయిట్ చేస్తున్నారు అభిమానులు.



# విడుదల తేదీ ప్రకటించిన సుకుమార్ కుమార్తె అవార్డు విన్నింగ్ మూవీ.!

టాలీవుడ్ స్టార్ దర్శకుడు సుకుమార్, శ్రీమతి తబితా సుకుమార్ దంపతుల కుమార్తె సుకృతి వేణి బండ్రెడ్డి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం గాంధీ తాత చెట్టు ఈ సినిమా ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని మేకర్స్ ప్రకటించారు. ఈ సినిమాను రిపబ్లిక్ డే కానుకగా జనవరి 24న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు వెల్లడించారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్‌తో పాటు గోపీ టాకీస్ సంస్థలు ఈ చిత్రాన్ని నిర్మించాయి. నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, శేష సింధు రావులు నిర్మాతలు. పద్మావతి మల్లాది దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రానికి తబితా సుకుమార్ సమర్పకురాలిగా వ్యవహరించారు. పర్యావరణ పరిరక్షణ ముఖ్య ఉద్దేశంగా తెరకెక్కిన ఈ సందేశాత్మక చిత్రంలో నటనకు గాను దుబాయ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, దాదా సాహెబ్ ఫాల్కే, ఇండియన్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమ తొలి సినిమా బాలనటిగా సుకృతి వేణి బండ్రెడ్డి అవార్డు అందుకుంది. ఇవే కాకుండా.. 11వ నోయిడా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్లో ఉత్తమ చిత్రంగా, న్యూఢిల్లి ఫిల్మ్ ఫెస్టివల్‌లో జ్యూరి బెస్ట్ ఫిలింగా, ఉత్త ప్రాంతీయ చిత్రంగా అవార్డులు అందుకోగా, జైపూర్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ల్ తో పాటు 8వ ఇండియన్ వరల్డ్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో బెస్ట్ జ్యూరీ ఫిలింగా గాంధీ తాత చెట్టు అవార్డులు అందుకోవడం విశేషం. ఇవి కాకుండా పలు ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్స్ నుండి ఈ చిత్రానికి ఆహ్వానాలు అందుతున్నాయి.

# ఎట్టకేలకు పట్టాలెక్కుతున్న రాజమౌళి-మహేశ్ ప్రాజెక్ట్.!

టాలీవుడ్ దర్శక దిగ్గజం ఎస్.ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబోలో ఒక సినిమా రానున్న విషయం తెలిసిందే. %యూవీదీ%29 అంటూ వస్తున్న ఈ ప్రాజెక్ట్ ఎప్పుడు పట్టాలెక్కుతుందా అని అటు బాబు ఫ్యాన్స్‌తో పాటు మూవీ లవర్స్ తెగ ఎదురుచూస్తున్నారు. హాలీవుడ్ సినిమాను తలపించేలా ఈ సినిమా ఉండబోతుందని రాజమౌళి ఈ సినిమా గురించి ఇప్పటికే హింట్ ఇచ్చాడు. దీంతో మూవీ ఎలా ఉండబోతుందని అందరూ ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. మరోవైపు ఈ సినిమాను

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,